


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 22-06-2026 | సంపుటి - 29 | సంచిక -30 | రూ : 4 | పేజీలు: 8


## ప్రపంచ ఉద్యమంగా యోగా

- వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా శాంతికి మంత్రం
- అభ్యాసం ఒక రోజుకు పరిమితం కాకూడదు
- అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రధాని ఉద్ఘాటన
- కోల్‌కతాలో ఆసనాలు వేసిన మోదీ

2లో






## ప్రశాంతంగా నీట్ రీ టెస్ట్

- 5400కు పైగా కేంద్రాల్లో నిర్వహణ
- హైదరాబాద్ లోనూ తరలివచ్చిన అభ్యర్థులు
- టఫ్ గా ఫిజిక్స్ పేపర్

న్యూఢిల్లీ : నీట్ యూజీ 2026 రీ టెస్ట్ ఆదివారం దేశవ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య ప్రశాంతంగా జరిగింది. దేశంలోని 551 నగరాల్లోని 5,440 కేంద్రాల్లోనూ, విదేశాల్లోని 14 కేంద్రాల్లోనూ ఈ రీ టెస్టును నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) నిర్వహించింది. ఈ పరీక్షకు 22.79 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. పేపర్ లీక్ కారణంగా మే 3న జరిగిన నీట్ యూజీ 2026 పరీక్షను రద్దు చేసిన సంగతి తెలిసిందే. పేపర్ లీక్‌పై సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఆదివారం నీట్ పరీక్షను మరోసారి నిర్వహించారు. మధ్యాహ్నం 2:00 గంటల నుంచి సాయంత్రం 5:15 గంటల వరకు ఈ పరీక్ష జరిగింది. అయితే వికలాంగ అభ్యర్థులకు సాయంత్రం 6:20 గంటల వరకు పరీక్ష రాయడానికి అనుమతించారు. ఈ పరీక్షను ఇంగ్లీష్‌తో సహా 12 భారతీయ భాషలలో నిర్వహించారు. ఎన్టీఏ అధికారుల సమాచారం ప్రకారం 95,000కు పైగా పరీక్షా గదులలో మొత్తం 1,38,560 సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటిని జాతీయ, రాష్ట్ర, మంత్రిత్వ శాఖల స్థాయిలో వర్చువల్‌గా పర్యవేక్షిస్తున్నామని తరువాయి 2లో

## ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి

- పలువురు కేంద్ర మంత్రులతో భేటీలు
- పార్టీ అగ్రనేతలనూ కలిసే అవకాశం



న్యూఢిల్లీ బ్యూరో : తెలంగాణ రాష్ట్రాభివృద్ధి, పలు కీలక ప్రాజెక్ట్ అనుమతులే ప్రధాన లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటన చేపట్టారు. పలువురు కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞప్తులు చేయనున్నారు. శనివారం ముంబయిలో జరిగిన ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ మనవరాలు, ఎంపీ సుప్రియా సులే కుమార్తె వివాహ రిసెప్షన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అక్కడి నుంచి నేరుగా సాయంత్రం ఏడు గంటలకు ఢిల్లీ చేరుకున్నారు. నేడు, రేపు (22, 23 తేదిల్లో) సీఎం ఢిల్లీలోనే ఉండనున్నట్టు ముఖ్య మంత్రి కార్యాలయం (సీఎంఓ) వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు పెండింగ్ తరువాయి 2లో

## ట్రంప్ మెప్పుకోసం ఎల్పీజీ దిగుమతి

- రూట్ మార్చిన మోడీ సర్కార్
- గల్ఫ్ దేశాల్ని కాదని అమెరికా నుంచి గ్యాస్ ఇంపోర్ట్

2లో




## ఒకే రోజు మూడు యుద్ధనౌకలు

- జాతికి అంకితం చేసిన ప్రధాని

కోల్ కతా : భారత నౌకాదళాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రధాని మోడీ ఐఎన్ఎస్ దుణగిరి, ఐఎన్ఎస్ సంశోధక్, ఐఎన్ఎస్ అగ్రయ్ అనే మూడు యుద్ధ నౌకలను జాతికి అంకితం చేశారు. శత్రువుల రహస్య ఎత్తుగడలను చిత్తు చేసేలా అత్యాధునిక దేశీయ పరిజ్ఞానంతో తయారు చేసిన వీటిని కోల్‌కతాలోని శ్యామా ప్రసాద్ ముఖర్జీ పోర్టులో ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. రక్షణ రంగంలో స్వావలంబన కోసం భారత్ చేస్తున్న కృషికి ఈ నౌకలు నిదర్శనమని ప్రధాని మోడీ పేర్కొన్నారు. భారతీయ పరిశ్రమల ప్రతిభ, ఇంజినీర్ల నైపుణ్యం, కార్మికుల కఠోర శ్రమ వల్లే వీటి నిర్మాణం సాధ్యమయ్యిందన్నారు.

### ఐఎన్ఎస్ దుణగిరి

భారత నేవీలో విశిష్ట సేవలు అందించిన నీలగిరి శ్రేణిగా



ఐఎన్ఎస్ దుణగిరి యుద్ధనౌకను ఎంతో ప్రత్యేకంగా నిర్మించారు. ప్రాజెక్టు 17ఏ పేరిట నిర్మించిన నౌకను 2022 జులై 15న జలప్రవేశం చేయించారు. దీని పొడవు 149 మీటర్లు. అడ్వాన్స్‌డ్ గైడెడ్ మిసైల్ ఫ్రిగేట్‌గా తీర్చిదిద్దారు. రాడార్, సెన్సర్‌లతో బహుముఖ పాత్ర పోషించేందుకు అనువుగా నిర్మించిన ఈ నౌక బ్రహ్మోస్ యాంటీ షిప్ క్రూజ్ క్షిపణులను కలిగి ఉంది. తరువాయి 2లో

## బీసీ గురుకుల.. కళాశాలల్లో సీట్లకు క్రేజ్

- సైన్స్, మ్యాథ్స్‌లో బాలికల విభాగాలు ఫుల్




హైదరాబాద్: రాష్ట్రంలో బీసీ గురుకుల జూనియర్ కళాశాలల్లో సీట్లకు డిమాండ్ పెరిగింది. 202627 ఏడాదికి మెజారిటీ కళాశాలల్లో సీట్లన్నీ భర్తీ అయ్యాయి. ప్రత్యేక పరీక్ష లేకుండా నేరుగా ప్రవేశాలు కల్పించడం, పది, ఇంటర్ పరీక్ష ఫలితాల్లో అగ్రస్థానంలో ఉండటంతో బీసీ గురుకులాల్లో ప్రవేశాలకు విద్యార్థులు వరుస కడుతున్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ల్యాబ్‌టెక్నీషియన్ తదితర కోర్సులు నిర్వహిస్తుండగా సైన్స్, మ్యాథ్స్‌లో బాలికల సీట్లు దాదాపు భర్తీ అయ్యాయి. బాలురు, బాలికలు కలిపి తొలి రెండు విడతల్లోనే దాదాపు 80శాతం సీట్లు భర్తీ కావడంతో.. ఇతర విద్యార్థులకు ప్రతిభ ఆధారంగా జిల్లా తరువాయి 2లో




## కవ్వించారు.. కుమ్మేశాడు

- లంక-ఎపై రెచ్చిపోయిన వైభవ్
- భారత్-ఎదే ముక్కోణపు వన్డే సిరీస్

దంబుల్లా: ముక్కోణపు వన్డే సిరీస్‌లో తిలక్ వర్మ నేతృత్వంలోని యువ భారత్ విజేతగా నిలిచింది. ఆదివారం ఫైనల్లో భారత్‌ఎ 66 పరుగుల తేడాతో ఆతిథ్య శ్రీలంకను చిత్తు చేసింది. వైభవ్ సూర్యవంశీ (94; 29 బంతుల్లో 10×4, 8×6) విధ్వంసక ఇన్నింగ్స్‌కు తిలక్ వర్మ (67; 90 బంతుల్లో 4×4, 1×6) బాధ్యతాయుత అర్ధశతకం.. అనుకుల్ రాయ్ (39; 20 బంతుల్లో 1×4, 4×6), ప్రియాంశ్ ఆర్య (39; 29 బంతుల్లో 6×4, 1×6) మెరుపులు తోడవడంతో మొదట భారత్‌ఎ 9 వికెట్లకు 377 పరుగుల భారీ స్కోరు సాధించింది. లంక బౌలర్లలో వనుజ సహాన్ (2/39) రాణించాడు. అనంతరం శ్రీలంకఎ 47.1 ఓవర్లలో 311 పరుగులకు ఆలౌటైంది. తరువాయి 2లో

## గిరిజన.. గొంతుకకు స్వేచ్ఛ



- గోండి భాషను తెలుగులోకి అనువదించేలా సిద్ధమవుతున్న ఏఐ యాప్
- ఉట్నూరు ఐటీడీఏ, ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ ప్రయత్నం

ఉట్నూరు: తమ సమస్యలను అధికారులకు చెప్పుకోవడానికి భాష రాని అడవి బిడ్డల కష్టాలు తీరనున్నాయి. ఆదివాసీలు తమ మాతృభాష గోండిలో మాట్లాడితే దాన్ని క్షణాల్లో తెలుగులోకి అనువదించే సాంకేతికత రూపుదిద్దుకుంటోంది. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు ఐటీడీఏ పీవో తరువాయి 2లో

# ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి

న్యూఢిల్లీ బ్యూరో : తెలంగాణ రాష్ట్రాభివృద్ధి, పలు కీలక ప్రాజెక్ట్ అనుమతులే ప్రధాన లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటన చేపట్టారు. పలువురు కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞప్తులు చేయనున్నారు. శనివారం ముంబయిలో జరిగిన ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ మనవరాలు, ఎంపీ సుప్రియా సులే కుమార్తె వివాహ రిసెప్షన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అక్కడి నుంచి నేరుగా సాయంత్రం ఏడు గంటలకు ఢిల్లీ చేరుకున్నారు. నేడు, రేపు (22, 23 తేదిల్లో) సీఎం ఢిల్లీలోనే ఉండనున్నట్టు ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు పెండింగ్ అంశాలపై కేంద్ర మంత్రులతో సీఎం వరుస సమావేశాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా... కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, ప్రహ్లాద్ జోషి, అశ్విని వైష్ణవ్, మనోహర్‌లాల్ ఖట్టర్, పీయూష్ గోయల్, ఇతర మంత్రుల అపాయింట్మెంట్ కోరినట్టు సమాచారం.

**రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ**

ఢిల్లీ పర్యటనలో ప్రధానంగా కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాత్ సింగ్‌తో సీఎం భేటీ కానున్నట్టు తెలిసింది. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ నది సుందరీకరణ, పునరుజ్జీవన ప్రాజెక్ట్ అభివృద్ధి పనులకు కేంద్ర రక్షణ శాఖ సానుకూలంగా స్పందించిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లోని బాపూఘాట్ వద్ద అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించడానికి కావాల్సిన 'గాంధీ సరోవర్ ప్రాజెక్ట్' కోసం 83 ఎకరాల భూము లు ఇవ్వడానికి రక్షణ శాఖ అంగీకారం తెలిపింది. గోల్కొండ ఆర్టిలరీ పరిధి లోని రూ. 533 కోట్ల విలువైన భూములు బదలాయింపునకు ఆమోదం తెలిపిం ది. ఈ నేపథ్యంలో ఢిల్లీ పర్యటనలో కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసి సీఎం కృతజ్ఞతలు తెలపనున్నారు. అలాగే సికింద్రాబాద్ ఫ్లైఓవర్ నిర్మాణాలకు కంటోన్మెంట్ భూముల అప్పగింత, సైనిక్ స్కూల్, ఇతర రక్షణ భూముల బదలాయింపు అంశాలపై మరోసారి విజ్ఞప్తి చేయనున్నట్టు సమాచారం.

**రైతు సమస్యలపై కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషితో చర్చలు**

అభివృద్ధితో పాటు రైతులు ఎదుర్కొంటోన్న సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి కేంద్రం దృష్టికి తీసుకెళ్లనున్నారు. ముఖ్యంగా పారా బాయిల్డ్ బియ్యం, ధాన్యం ఉత్పత్తి, బకాయిల విడుదల అంశంపై కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో ముఖ్యమంత్రి భేటీ కానున్నట్టు సమాచారం. గత పర్యటనలో భాగంగా పారాబాయిల్డ్ బియ్యాన్ని సేకరించాలని సీఎం కోరారు. అలాగే ఈసారి భారీ దిగుబడి నేపథ్యంలో అంచనాకు మించిన సేకరణ, రాష్ట్రం లో బియ్యం సేకరణలో కలుగుతోన్న ఇబ్బందులపై చర్చించనున్నారు. దీంతో పాటు పాఠశాలలు, హాస్టళ్లు, ఐసీడీఎస్ కేంద్రాల ద్వారా ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్ (ఎఫ్ఆర్‌కే) పంపిణీని పునరుద్ధరించాలని కోరనున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి.

**రైల్వే మంత్రితో భేటీ..**

వీటితో పాటు హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు రెండో దశ విస్తరణ, దానికి సంబంధించిన నిధుల సమీకరణపై సీఎం ప్రత్యేక దృష్టి సారించారు. మెట్రో ప్రాజెక్టు కోసం ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్‌సీ) నుంచి రుణం పొందే అంశంపై చర్చించేందుకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ అపాయింట్మెంట్ కోరినట్టు తెలిసింది. ఈ భేటీలో... మెట్రో రైల్ ప్రాజెక్ట్ పురోగతికి సహకరించాలని కోరనున్నారు. అయితే... కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయాల్సిందిగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ లేఖ రాశారు. ఈ నెల 22 లేదా 23వ తేదీల్లో ఢిల్లీలో ఉంటాననీ.. రైల్వే మంత్రితో సమయం ఖరారు చేయిస్తే, ఇద్దరం కలిసి వెళ్లి తెలంగాణకు అత్యంత కీలకమైన ఈ అంశాలపై చర్చిద్దామని లేఖలో స్పష్టం చేశారు. మెట్రో రైల్ ప్రాజెక్టులో కేంద్ర ప్రభుత్వ జోక్యాన్ని కోరుతూ ఈ నెల 18నే అన్ని వివరాలతో కూడిన లేఖను పంపినట్టు సీఎం గుర్తుచేశారు. కాగా... ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని ఒప్పంద పత్రాలు, అనుబంధ డాక్యుమెంట్లు, వాస్తవ రికార్డులతో ఢిల్లీలో ఉండాలని సీఎం అధికారులను ఆదేశించినట్టు సమాచారం. అలాగే కేంద్రమంత్రి పీయూష్ గోయల్ అపాయింట్‌మెంట్‌ను సీఎంఓ కోరినట్టు తెలిసింది. జహీరాబాద్ ఇండస్ట్రీయల్, వరంగల్ మెగా టెక్స్‌టైల్ పార్క్, హైదరాబాద్-విజయవాడ పారిశ్రామిక కారిడార్, ఇతర అంశాలపై చర్చించనున్నట్టు సమాచారం. వీరితో పాటు కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఇతర మంత్రుల సమయం కోరినట్టు విశ్వసనీయంగా తెలిసింది.

**అధిష్టాన పెద్దలతోనూ భేటీ**

ఢిల్లీ పర్యటనలో భాగంగా పార్టీ పెద్దలతోనూ సీఎం రేవంత్‌రెడ్డి భేటీ కానున్నారు. ప్రధానంగా పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ సమయం కోరినట్టు తెలిసింది. అలాగే ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, పార్టీ నేషనల్ జనరల్ సెక్రెటరీ (సంస్థాగత) కేసీ వేణుగోపాల్, ప్రియాంక గాంధీలను కలవనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో తాజా రాజకీయ పరిస్థితులను హైకమాండ్ పెద్దలకు వివరించనున్నారు. అలాగే త్వరలో మంత్రివర్గ విస్తరణ, శాఖల్లో మార్పులు జరిగే అవకాశం ఉన్నందున ఈ అంశాలపై కీలకంగా చర్చించనున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. అలాగే ప్రభుత్వం, పార్టీ మధ్య సమన్వయం, పార్టీ చేపట్టాల్సిన పలు కార్యక్రమాలు, ఇతర విషయాలపై చర్చించనున్నారు.

# ట్రంప్ మెప్పుకోసం ఎల్పీజీ దిగుమతి

న్యూఢిల్లీ : పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ప్రపంచ ఇంధన మార్కెట్‌ను కుదిపేస్తున్న తరుణంలో భారత్ అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరించింది. వంటగ్యాస్ సరఫరాకు ఎటువంటి అంతరాయం కలగకుండా గల్ఫ్ దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించుకుంటూ దిగుమతులను భారీగా వైవిధ్యీకరించింది. అమెరికా, ఇరాన్ వంటి దేశాల నుంచి దిగుమతులను ముమ్మరం చేసింది. అదే సమయంలో, అంతర్జాతీయంగా ధరలు పెరిగినప్పటికీ దేశీయంగా సామాన్యుడిపై భారం పడకుండా ప్రభుత్వ రంగ చమురు సంస్థలు ఆ నష్టాన్ని తామే భరించాయి. అని పేర్కొంటున్నాయి. అయితే ట్రంప్ మెప్పుకోసం ఎల్పీజీని మోడీ సర్కార్ దిగుమతి చేసుకుంటోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**'90 శాతం గల్ఫ్ దేశాల నుంచే'**

గతంలో భారత్ తన ఎల్‌పీజీ దిగుమతుల్లో దాదాపు 90 శాతం కేవలం గల్ఫ్ దేశాల నుంచే పొందేది. అయితే అక్కడ యుద్ధ వాతావరణం నెలకొనడంతో, సరఫరా దెబ్బతినకుండా ఉండేందుకు భారత్ తన దిగుమతుల వ్యూహాన్ని మార్చింది. ప్రముఖ రేటింగ్ సంస్థ 'క్రిసిల్' నివేదిక ప్రకారం, ఈ ఏడాది ఫిబ్రవరిలో అమెరికా నుంచి భారత్ కేవలం 8 శాతం ఎల్పీజీ ని దిగుమతి చేసుకోగా, ఏప్రిల్ నాటికి అది ఏకంగా మూడో వంతుకు అంటే సుమారు 33 శాతానికి పెరిగింది. 2025 చివరలో అమెరికాతో కుదుర్చుకున్న 2.2 మిలియన్ టన్నుల సరఫరా ఒప్పందం ఈ క్లిష్ట సమయంలో భారత్‌కు ఎంతగానో అండగా నిలిచింది.

*** ఇండస్ట్రియల్ వినియోగదారులు ధరల భారం భరించలేక**

కేవలం అమెరికా మాత్రమే కాదు, చాలా కాలం తర్వాత ఇరాన్ కూడా మళ్లీ భారత్ దిగుమతుల జాబితాలోకి చేరింది. ఏప్రిల్ దిగుమతుల్లో ఇరాన్ వాటా 6 శాతంగా నమోదైంది. వీటితో పాటు అర్జెంటీనా, చిలీ, ఫ్రాన్స్, నెదర్లాండ్స్ వంటి సుదూర దేశాల నుంచి కూడా భారత్ ఎల్పీజీని సేకరించింది. అయితే ఈ సుదూర ప్రయాణాల వల్ల రవాణా ఖర్చులు భారీగా పెరిగాయి. పశ్చిమాసియాలో సంక్షోభం వల్ల అంతర్జాతీయంగా ఎల్పీజీ ధరలు ఆకాశాన్నంటాయి. భారత దిగుమతులకు ప్రామాణికమైన 'సౌదీ అరామ్‌కో కాంట్రాక్ట్ ప్రైస్' ఫిబ్రవరి నుంచి జూన్ మధ్య ఏకంగా 46 శాతం పెరిగింది. ధరల పెరుగుదల, పరిమిత లభ్యత కారణంగా భారత్‌లో ఎల్‌పీజీ వినియోగం కూడా తగ్గింది. ఫిబ్రవరిలో 3.2 మిలియన్ టన్నులుగా ఉన్న వినియోగం, ఏప్రిల్‌లో 2.47 మిలియన్ టన్నులకు పడిపోయింది. ముఖ్యంగా మార్కెట్ ధరలతో ముడిపడి ఉన్న కమర్షియల్, ఇండస్ట్రియల్ వినియోగదారులు ధరల భారం భరించలేక వాడకాన్ని తగ్గించుకున్నారు.

# ఒకే రోజు మూడు యుద్ధనౌకలు

కోల్ కతా : భారత నౌకాదళాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రధాని మోడీ ఐఎన్ఎస్ దుణగిరి, ఐఎన్ఎస్ సంశోధక్, ఐఎన్ఎస్ అగ్రయ్ అనే మూడు యుద్ధ నౌకలను జాతికి అంకితం చేశారు. శత్రువుల రహస్య ఎత్తుగడలను చిత్తు చేసేలా అత్యాధునిక దేశీయ పరిజ్ఞానంతో తయారు చేసిన వీటిని కోల్‌కతాలోని శ్యామా ప్రసాద్ ముఖర్జీ పోర్టులో ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. రక్షణ రంగంలో స్వావలంబన కోసం భారత్ చేస్తున్న కృషికి ఈ నౌకలు నిదర్శనమని ప్రధాని మోడీ పేర్కొన్నారు. భారతీయ పరిశ్రమల ప్రతిభ, ఇంజినీర్ల నైపుణ్యం, కార్మికుల కఠోర శ్రమ వల్లే వీటి నిర్మాణం సాధ్యమయ్యిందన్నారు.

**ఐఎన్ఎస్ దుణగిరి**

భారత నేవీలో విశిష్ట సేవలు అందించిన నీలగిరి శ్రేణిగా ఐఎన్ఎస్ దుణగిరి యుద్ధనౌకను ఎంతో ప్రత్యేకంగా నిర్మించారు. ప్రాజెక్టు 17ఏ పేరిట నిర్మించిన నౌకను 2022 జులై 15న జలప్రవేశం చేయించారు. దీని పొడవు 149 మీటర్లు. అడ్వాన్స్‌డ్ గైడెడ్ మిసైల్ ఫ్రిగేట్‌గా తీర్చిదిద్దారు. రాడార్, సెన్సర్‌లతో బహుముఖ పాత్ర పోషించేందుకు అనువుగా నిర్మించిన ఈ నౌక బ్రహ్మోస్ యాంటీ షిప్ క్రూజ్ క్షిపణులను కలిగి ఉంది.

**ఐఎన్ఎస్ సంశోధక్**

భారత నౌకాదళానికి సముద్ర భౌగోళిక, (హైడ్రోగ్రాఫిక్ సర్వే) సరిహద్దు జలాలు, సమగ్ర కొలతలు, కచ్చితత్వ పరిమాణం వంటి అంశాలపై నివేదికల తయారీలో సామర్థ్యం పెంచేందుకు దోహదపడేలా ఐఎన్ఎస్ సంశోధక్ నౌకను నిర్మించారు. ఇది 110 మీటర్ల పొడవుతో ఉంటుంది. 2023 జూన్ 13న జలప్రవేశం చేయించారు. పోర్టులు, లోతైన సముద్ర మార్గాలు, మారిటైం పరిధిలో సముద్ర అధ్యయనం, నావిగేషన్ విధుల కోసం ప్రత్యేక హెలికాప్టర్, విపత్కర పరిస్థితుల్లో మానవీయ సాయానికి, రక్షణ చర్యలు చేపట్టేందుకు అనువుగా సంశోధక్ నిర్మాణం చేశారు.

**ఐఎన్ఎస్ అగ్రయ్**

కోల్‌కతాలోని గార్డెన్‌రీచ్ షిప్‌బిల్డింగ్ ఇంజినీర్స్ (జీఆర్ఎస్ఈ)లో ఐఎన్ఎస్ అగ్రయ్ నౌకను యాంటీ సబ్‌మెరైన్ షాలో వాటర్ క్రాఫ్ట్‌గా నిర్మించారు. ఇది 77.6 మీటర్ల పొడవుంటుంది. 2024 మార్చి 13న జలప్రవేశం చేయించారు. తీర జలాల్లో ఆపరేషనల్ విధులకు అనువుగా ఈ యుద్ధనౌకను డిజైన్ చేశారు. ఉపరితల నిఘా, అన్వేషణ, శత్రువులపై దాడికి స్వీయ ఎయిర్‌క్రాఫ్ట్‌తో సమన్వయం చేసుకునేలా 88 శాతం ఆధునిక స్వీయ సాంకేతిక పరిజ్ఞానం వినియోగించారు. 30ఎంఎం నేవల్ సర్ఫేస్ గన్, వాటర్ జెట్లతో డీజిల్ యంత్రాలను అనుసంధానం చేయడం దీని ప్రత్యేకత.

# ప్రశాంతంగా నీట్ రీ టెస్ట్

న్యూఢిల్లీ : నీట్ యూజీ 2026 రీ టెస్ట్ ఆదివారం దేశవ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య ప్రశాంతంగా జరిగింది. దేశంలోని 551 నగరాల్లోని 5,440 కేంద్రాల్లోనూ, విదేశాల్లోని 14 కేంద్రాల్లోనూ ఈ రీ టెస్టును నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) నిర్వహించింది. ఈ పరీక్షకు 22.79 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. పేపర్ లీక్ కారణంగా మే 3న జరిగిన నీట్ యూజీ 2026 పరీక్షను రద్దు చేసిన సంగతి తెలిసిందే. పేపర్ లీక్‌పై సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఆదివారం నీట్ పరీక్షను మరోసారి నిర్వహించారు. మధ్యాహ్నం 2:00 గంటల నుంచి సాయంత్రం 5:15 గంటల వరకు ఈ పరీక్ష జరిగింది. అయితే వికలాంగ అభ్యర్థులకు సాయంత్రం 6:20 గంటల వరకు పరీక్ష రాయడానికి అనుమతించారు. ఈ పరీక్షను ఇంగ్లీష్‌తో సహా 12 భారతీయ భాషలలో నిర్వహించారు. ఎన్టీఏ అధికారుల సమాచారం ప్రకారం 95,000కు పైగా పరీక్షా గదులలో మొత్తం 1,38,560 సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటిని జాతీయ, రాష్ట్ర, మంత్రిత్వ శాఖల స్థాయిలో వర్చువల్‌గా పర్యవేక్షిస్తున్నామని ఎన్టీఏ అధికారులు తెలిపారు. అలాగే 51,311 జామర్‌లను అందుబాటులో ఉంచినట్టు కూడా చెప్పారు. పరీక్ష సజావుగా, నిష్పక్షపాతంగా జరిగేలా కేంద్రాల వద్ద డ్రోన్‌లను, అదనపు సిబ్బందిని మోహరించారు. దేశ రాజధానితో సహా అనేక రాష్ట్రాల్లో, పరీక్షా కేంద్రాల వెలుపల వేచి ఉన్న తల్లిదండ్రులు, సంరక్షకుల కోసం ఉచిత తాగునీరు, అల్పాహారం కూడా ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. దేశరాజధాని ఓఖ్లాలోని ఎన్టీఏ ప్రధాన కార్యాలయం నుంచి పరీక్ష సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లను కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సమీక్షించారు. "పరీక్షను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం" అని విద్యా మంత్రిత్వ శాఖ తెలిపింది. కొంత మంది అభ్యర్థులు, అభ్యర్థుల తల్లిదండ్రులతో ఈ సందర్భంగా ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడారు. తమ సమస్యలను వారు మంత్రికి తెలియచేశారు.

**బురఖా ధరించారని..**

కాగా, రాజస్తాన్ లోని అజ్మీర్‌లో బురఖా ధరించిన ఒక అభ్యర్థిని పరీక్షా కేంద్రంలోకి అనుమతించలేదు. కుల్సుమ్ బానో అనే అభ్యర్థి దీని గురించి మాట్లాడుతూ తాను గతంలో మే 3న జరిగిన పరీక్షకు కూడా ఇదే దుస్తులు ధరించి హాజరయ్యానని కానీ, ఇప్పుడు లోనికి అనుమతించడ లేదని ఆరోపించారు. "నేను నీట్ పరీక్ష రాయడానికి బేవార్ నుంచి వచ్చాను. మే 3న పరీక్ష రాసినప్పుడు కూడా, ఇప్పుడున్నట్లే బురఖా, దుపట్టా ధరించి ఉన్నాను. కానీ ఇప్పుడు దుపట్టా, బురఖా కూడా తీసేయాల్సిందేనని స్పష్టం చేశారు" అని ఆమె పరీక్ష ప్రారంభం కావడానికి ముందు చెప్పారు. " ఎన్‌టిఎ మాకు అనుమతి ఇచ్చినప్పుడు, ఈ వ్యక్తులు మమ్మల్ని ఆపలేరు. ఈ దుస్తులలో నన్ను అనుమతించకపోతే, నేను అస్సలు పరీక్ష రాయను. నాకు పరీక్ష ముఖ్యం కాదు.. నా 'బురఖా', నా గుర్తింపు మాత్రమే ముఖ్యం' అని ఆమె పేర్కొన్నారు. చివరికి ఈ అభ్యర్థిని కేంద్రంలోకి అనుమతించారని ఎన్టీఏ తరువాత స్పష్టం చేసింది. మధ్యప్రదేశ్ భోపాల్‌లో ఒక పరీక్ష కేంద్రం వద్ద ఆలస్యంగా వచ్చిన ఇద్దరు అభ్యర్థులను లోపలికి అనుమతించలేదు. అభ్యర్థుల్లో ఒకరి అంకుల్ అయిన అమీర్ ఖాద్రీ మాట్లాడుతూ ' పరీక్ష కోసం ఇక్కడకు వస్తుండగా దారిలో మాకు ప్రమాదం జరిగింది. నా మేనల్లుడికి ప్రథమ చికిత్స చేయించడంతో కొంచెం ఆలస్యమైంది. అయినా, ఆలస్యమైందని మా వాడిని లోపలికి అనుమతించడం లేదు. ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించడం కుదరదని అధికారులు చెప్పారు' అని తెలిపారు. కొల్‌కతా, దాని పరిసర ప్రాంతాలను శనివారం రాత్రి నుంచి భారీ వర్షాలు ముంచెత్తాయి. దీంతో పలుచోట్ల రహదారులు తీవ్రమైన జలమయమై, వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రీటెస్ట్ కోసం పరీక్షా కేంద్రాలకు ప్రయాణిస్తున్న నీట్ అభ్యర్థులతో సహా ఇతర ప్రయాణికులకు ఇబ్బందులు కలిగాయి.

# కవ్వించారు.. కుమ్మేశాడు

దంబుల్లా: ముక్కోణపు వన్డే సిరీస్‌లో తిలక్ వర్మ నేతృత్వంలోని యువ భారత్ విజేతగా నిలిచింది. ఆదివారం ఫైనల్లో భారత్‌ఎ 66 పరుగుల తేడాతో ఆతిథ్య శ్రీలంకను చిత్తు చేసింది. వైభవ్ సూర్యవంశీ (94; 29 బంతుల్లో 10×4, 8×6) విధ్వంసక ఇన్నింగ్స్‌కు తిలక్ వర్మ (67; 90 బంతుల్లో 4×4, 1×6) బాధ్యతాయుత అర్ధశతకం.. అనుకుల్ రాయ్ (39; 20 బంతుల్లో 1×4, 4×6), ప్రియాంశ్ ఆర్య (39; 29 బంతుల్లో 6×4, 1×6) మెరుపులు తోడవడంతో మొదట భారత్‌ఎ 9 వికెట్లకు 377 పరుగుల భారీ స్కోరు సాధించింది. లంక బౌలర్లలో వనుజ సహాన్ (2/39) రాణించాడు. అనంతరం శ్రీలంకఎ 47.1 ఓవర్లలో 311 పరుగులకు ఆలౌటైంది. యశ్ ఠాకూర్ (3/45), విప్రాజ్ నిగమ్ (3/60), అనుకుల్ రాయ్ (2/42) ప్రత్యర్థిని దెబ్బ తీశారు. లంక బ్యాటర్లలో వనుజ సహాన్ (62), సదీర సమర విక్రమ (52), విజయకాంత్ (39), సహాన్ (38) పోరాడారు. అఫ్గానిస్థాన్‌ఎ టోర్నీలో పాల్గొన్న మూడో జట్టు.

ఫోర్లు, సిక్సర్లతో 50: ఈ మ్యాచ్‌లో మిగతా ఆటంతా ఒకెత్తయితే.. భారత ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ ఆట మరో ఎత్తు. లీగ్ దశలో సూపర్ ఓవర్లో లంక చేతిలో భారత్ ఓటమి పాలైన మ్యాచ్‌లో అతణ్ని లంక బౌలర్ విషేన్ హలంబాగే కవ్వించడంతో పెద్ద గొడవ జరిగిన సంగతి తెలిసిందే. లీగ్ దశలో ఒక్క అర్ధశతకం కూడా సాధించని అతను.. ఫైనల్లో రెచ్చిపోయాడు. అతను కేవలం 11 బంతుల్లోనే అర్ధశతకం బాదేశాడు. అందులో ఒక్క సింగిల్ కూడా లేదు. కేవలం బౌండరీలతోనే (5 ఫోర్లు, 5 సిక్సర్లు) అతను 50 మార్కును అందుకున్నాడు. 4, 6, 6, 0, 6, 4, 4, 6, 6, 4, 4, 2, 4.. ఇదీ ఒక దశలో అతడి వీరవిహారం సాగిన తీరు. సెంచరీ చేసేలా కనిపించిన అతను.. లంక కెప్టెన్ సహాన్ వేసిన తొమ్మిదో ఓవర్లో ఔటైపోయాడు. తర్వాతి ఓవర్లోనే మరో ఓపెనర్ ప్రియాంశ్ కూడా వెనుదిరిగాడు. తర్వాత రుతురాజ్, కుశాగ్రలతో కీలక భాగస్వామ్యాలు నెలకొల్పిన కెప్టెన్ తిలక్ జట్టును పటిష్ట స్థితికి చేర్చాడు. ఆఖర్లో అనుకుల్, విప్రాజ్ (27; 20 బంతుల్లో 2×4, 1×6) కూడా రాణించడంతో భారత్ లంక ముందు భారీ లక్ష్యాన్ని నిలిపింది. తర్వాత యశ్ ఠాకూర్ టాప్3 బ్యాటర్లను త్వరగా పెవిలియన్ చేర్చడంతో లంక ఏ దశలోనూ లక్ష్యం దిశగా సాగలేదు. సదీర, సహాన్, వనుజ, విజయకాంత్‌ల పోరాడి ఓటమి అంతరాన్ని తగ్గించారు. స్పిన్నర్లు విప్రాజ్, అనుకుల్.. మిడిల్, లోయర్ ఆర్డర్ల పని పట్టారు.

# బీసీ గురుకుల కళాశాలల్లో సీట్లకు క్రేజ్

హైదరాబాద్: రాష్ట్రంలో బీసీ గురుకుల జూనియర్ కళాశాలల్లో సీట్లకు డిమాండ్ పెరిగింది. 202627 ఏడాదికి మెజారిటీ కళాశాలల్లో సీట్లన్నీ భర్తీ అయ్యాయి. ప్రత్యేక పరీక్ష లేకుండా నేరుగా ప్రవేశాలు కల్పించడం, పది, ఇంటర్ పరీక్ష ఫలితాల్లో అగ్రస్థానంలో ఉండటంతో బీసీ గురుకులాల్లో ప్రవేశాలకు విద్యార్థులు వరుస కడుతున్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ల్యాబ్‌టెక్నీషియన్ తదితర కోర్సులు నిర్వహిస్తుండగా సైన్స్, మ్యాథ్స్‌లో బాలికల సీట్లు దాదాపు భర్తీ అయ్యాయి. బాలురు, బాలికలు కలిపి తొలి రెండు విడతల్లోనే దాదాపు 80శాతం సీట్లు భర్తీ కావడంతో.. ఇతర విద్యార్థులకు ప్రతిభ ఆధారంగా జిల్లా స్థాయిలో స్పాట్‌కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తోంది. ఈ నెలాఖరు నాటికి నూరుశాతం సీట్లన్నీ భర్తీ అవుతాయని సంక్షేమ వర్గాలు వెల్లడించాయి.

వారికి తొలి ప్రాధాన్యం..: గతంలో ఇంటర్ సీట్ల భర్తీకి సొసైటీ ప్రత్యేకంగా ప్రవేశ పరీక్ష నిర్వహించి అందులో ప్రతిభ ఆధారంగా భర్తీ చేసేది. మెరిట్ వచ్చిన అభ్యర్థులు గడువులోగా చేరకపోవడం, తదుపరి మెరిట్ అభ్యర్థులు ఇతర కళాశాలల్లోకి వెళ్లడంతో సీట్లు భర్తీ అవక సగానికిపైగా ఖాళీగా ఉండేవి. ఈ ఏడాది నుంచి ప్రవేశపరీక్ష లేకుండా బీసీ గురుకులాల్లో చదివిన విద్యార్థులకు తొలిప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది. దీంతో గురుకుల విద్యార్థులు కోరుకున్న సీట్ల కోసం దరఖాస్తు చేశారు.

# గిరిజన గొంతుకకు స్వేచ్ఛ

తమ సమస్యలను అధికారులకు చెప్పుకోవడానికి భాష రాని అడవి బిడ్డల కష్టాలు తీరనున్నాయి. ఆదివాసీలు తమ మాతృభాష గోండిలో మాట్లాడితే దాన్ని క్షణాల్లో తెలుగులోకి అనువదించే సాంకేతికత రూపుదిద్దుకుంటోంది. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు ఐటీడీఏ పీవో మంద మకరందు చొరవతో ట్రిపుల్ ఐటీ, హైదరాబాద్ భాగస్వామ్యంతో రూపకల్పన చేసిన 'స్వేచ్ఛ యాప్'తో ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. గతంలో కేంద్ర ప్రభుత్వం ఆదివాణి పేరుతో ఓ కార్యక్రమాన్ని చేపట్టినా అందులో దక్షిణ భారత గోండి భాషకు చోటు దక్కలేదు. ఈ లోటును భర్తీ చేస్తూ ఉట్నూరు ఐటీడీఏ ఈ క్రతువు చేపట్టింది. ఇందులో 200 గంటల గోండి భాషా పదాల ఆడియో రికార్డింగ్‌తో పాటు 20 వేల తెలుగు పదాలను కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతతో అనుసంధానిస్తున్నారు.

**వచ్చే ఆగస్టు 15 నాటికి సిద్ధం**

గోండి భాష సమన్వయకర్త దేవ్‌రావు ఆధ్వర్యంలో నిపుణుడు ప్రవీణ్ అందజేస్తున్న సాంకేతికతతో గోండ్వానా పంచాయతీరాయిసెంటర్ల సార్‌మేడిలు, ఆదివాసీ పెద్దల సమక్షంలో ఉట్నూరులో గత నెల 11 నుంచి ఈ కార్యక్రమం సాగుతోంది. తాజాగా వీటిపై ఇక్కడే ఆదివాసీ పెద్దలతో ఏర్పాటుచేసిన వర్క్‌షాప్‌లో గోండి భాష సంకల్ప కసరత్తు వేగిరం చేశారు. రాబోయే స్వాతంత్ర్య దినోత్సవం ఆగస్టు 15 నాటికి ఈ యాప్‌ను అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో ఉన్నారు.

# ప్రపంచ ఉద్యమంగా యోగా

కోల్‌కతా: యోగా అనేది ప్రపంచ ఉద్యమమని, అది దేశాల.. సాంస్కృతిక సరిహద్దులను అధిగమిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. కేవలం ఒక్క రోజుకో, ఒక్క కార్యక్రమానికో పరిమితం చేయకుండా యోగాభ్యాసాన్ని దైనందిన జీవనంలో భాగంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. జూన్ 21 అంటే సుదీర్ఘ పగలు ఉండే రోజుగానే కాకుండా అతి పెద్ద సామాజిక వేడుక దినంగా మారిందని, దానికి యోగా కారణమని పేర్కొన్నారు. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కోల్‌కతాలోని రెడ్‌రోడ్‌లో జరిగిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కోల్‌కతాతోపాటు దేశంలోని అనేక ప్రాంతాల్లో, విదేశాల్లోని భారత రాయబార కార్యాలయాల ఆధ్వర్యంలో భారీగా వేడుకలు నిర్వహించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, కేంద్ర మంత్రులు, ఆయా రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్యమంత్రులు, వివిధ వర్గాలవారు, దౌత్యవేత్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కోల్‌కతా కార్యక్రమంలో మోదీ మాట్లాడుతూ వ్యక్తిగత ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవడానికే కాకుండా ప్రపంచ శాంతికి ఉత్ప్రేరకంగా యోగా నిలుస్తుందని చెప్పారు. 'ప్రాచీన భారతీయ అభ్యాసమైన యోగావల్ల శారీరక ఆరోగ్యానికి మించిన ప్రయోజనాలు అనేకం ఉన్నాయి. పనిని, పోషకాహారాన్ని, నిద్రను మనం సమతుల్యం చేసుకోవాలి. ఆధునిక జీవనశైలిలో దీనికి కొంత అవాంతరం వాటిల్లుతుంటుంది. ఏం చేయాలి.. ఏం చేయకూడదు.. జీవితాన్ని ఎలా సంతులనం చేసుకోవాలనేది యోగా మనకు చెబుతుంది.

# స్వయం ఉపాధితోనే.. యువతకు ఉజ్వల భవిష్యత్

- ఆదిత్య డయాగ్నోస్టిక్ సెంటర్ ప్రారంభం
- ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరుగదిండ్ల భాస్కర్



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: యువత స్వయం ఉపాధి రంగాల్లో రాణిస్తూ ఆర్థికాభివృద్ధి సాధించాలని ఇ.ఎల్.వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరుగదిండ్ల భాస్కర్ అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం చిన్నకొండూర్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఆదిత్య డయాగ్నోస్టిక్ సెంటర్ ను ఆదివారం ప్రారంభించారు. ఆయనతో పాటు ఫౌండేషన్ సభ్యులు రక్త పరీక్షలు చేయించుకున్నారు. ప్రారంభోత్సవ కానుకగా రూ.20వేల రూపాయలను అందజేశారు. ఈ సందర్భంగా ఇరుగదిండ్ల భాస్కర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ముందస్తు ఆరోగ్య పరీక్షలు ఎంతో మేలు చేస్తాయన్నారు. యువత కేవలం ఉద్యోగాల కోసమే వేచి చూడకుండా, స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకుని తోటి వారికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలన్నారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తూ, ప్రజల నమ్మకాన్ని పొందాలని సూచించారు. విద్యా, వైద్యం, ఉపాధి కల్పనకు ఫౌండేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాడుతాం

* సంగారెడ్డి జిల్లా టీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బాలయ్య
* జోగిపేటలో పతాకావిష్కరణ



అందోలు, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలపై టీఆర్ఎస్ పార్టీ పోరాడడానికి ముందుంటుందని జిల్లా టీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ బాలయ్య అన్నారు.శనివారం జోగిపేట ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం హనుమాన్ చౌరస్తాలో ఇటీవల మాజీ ఎమ్మెల్సీ కవిత స్థాపించిన టీఆర్ఎస్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ చూపిన బాటలోనే కొత్త టీఆర్ఎస్ పార్టీ నడుస్తుందని అన్నారు. పార్టీ కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి జయశంకర్ ఆశయాలు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకుడు ఎండీ ఖలీల్ తో పాటు అందోలు, టేక్మాల్ మండలాలకు చెందిన కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ పై అవగాహన కల్పించేందుకు 2కే రన్

* జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.



జనగామ,ప్రజాస్ఫూర్తి : జిల్లాలో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్2026) ప్రక్రియపై ప్రజల్లో అవగాహన పెంపొందిం చేందుకు ఆదివారం 2కే రన్ నిర్వహిం చారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు, యువత, విద్యార్థులు పాల్గొని ఓటరు జాబితా సవరణ ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. ఎస్ఐఆర్2026 ద్వారా ఓటరు జాబి తాలను పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించడం లక్ష్యమని అధికారు లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు కావ డం, నకిలీ లేదా అనర్హ పేర్ల తొలగింపు కోసం ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు పే ర్కొన్నారు. ప్రజలు బూత్ లెవల్ అధికా రులకు సహకరించి తమ వివరాలను సరిచూసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అధికారులు ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించి, ఓటరు జాబి తా సవరణలో ప్రతి పౌరుడు భాగస్వా మి కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, ఉద్యోగులు, యువత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# లండన్ కిడ్స్ పాఠశాలలో ఘనంగా అంతర్జాతీయ యోగ దినోత్సవం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ పట్టణంలోని లండన్ కిడ్స్ పాఠశాలలో అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.జూన్ 21 యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి వివిధ యోగాసనాలు ప్రదర్శించి యోగ ప్రాముఖ్యతను చాటిచెప్పారు.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ బూర పూర్ణ చందర్ మాట్లాడుతూ యోగ శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని, విద్యార్థులు ప్రతిరోజూ యోగను అలవాటు చేసుకోవాలని సూచించారు. యోగ వల్ల ఏకాగ్రత, క్రమశిక్షణ పెరగడంతో పాటు ఆరోగ్యవంతమైన జీవనశైలి సాధ్యమవుతుందని వివరించారు. కార్యక్రమంలో బూర శరణ్య, ప్రిన్సిపాల్ హిమబిందు, మీనాక్షి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని యోగాసనాలు నిర్వహించారు.

## యోగా ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు
# మానసిక ప్రశాంతత పెంపొందుతుంది

* ప్రముఖ యోగా మాస్టర్ దేవేందర్ సాంఘీ





జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : యోగా ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని భారతీయ యోగ్ సంస్థాన్ హైదరాబాద్ ప్రతినిధి, ప్రముఖ యోగా మాస్టర్ దేవేందర్ సాంఘీ అన్నారు.అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం చింతల్ శ్రీ సాయి కాలనీలోని యోగా హాల్ లో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవేందర్ సాంఘీతో పాటు శ్రీ సాయి కాలనీ ఆలయాల చైర్మన్ కన్నెకంటి లక్ష్మన్, అన్నప్రసాద ట్రస్ట్ చైర్మన్ కన్నెకంటి శైలజ, యోగా ఇన్‌చార్జ్ మందాడి ఉమాపార్వతి పాల్గొని యోగా యొక్క ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో పెరుగుతున్న ఒత్తిడి, ఆందోళనలు, మానసిక సమస్యల నుంచి ఉపశమనం పొందేందుకు యోగా ఉత్తమ మార్గమని వారు పేర్కొన్నారు. ప్రతిరోజూ కనీసం ఒక గంట యోగాభ్యాసానికి కేటాయించడం ద్వారా అనేక జీవనశైలి వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. యువత, మహిళలు, వృద్ధులు యోగాను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా యోగా సాధకులు తమ అనుభవాలను పంచుకుంటూ, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సత్యవతి, వాణి, సరళ, కవిత, హిమజ, సుమతి, రాజ్యలక్ష్మి, త్రివేణి, యామిని, సంధ్య, రమ, రేఖాదేవి, స్రవంతి, సంగీత, శ్రీలత, మౌనిక, రఘురామరాజు, టీవీ చారి, రమేష్, సంతోష్, శ్రేయాన్స్, రామారావు, మధు, అయోధ్య, హరీష్, శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

# మసీదుగూడెంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

* ఉత్సాహంగా యోగాసనాలు వేసిన వృద్ధులు
* యోగ అభ్యాసకురాలు గూడూరు భారతమ్మ



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: నిత్యం యోగా చేయడంతో ప్రశాంతమైన జీవన విధానం అలవడుతుందని వార్డు సభ్యురాలు, యోగ అభ్యాసకురాలు గూడూరు భారతమ్మ అన్నారు. చౌటుప్పల్ మండలం మసీదు గూడెం గ్రామంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వార్డు సభ్యురాలు గూడూరు భారతమ్మ గ్రామంలోని మహిళలు, వృద్ధులతో యోగాసనాలు చేయించారు. వృద్ధులు సైతం ఓర్పుగా, ఉత్సాహంగా యోగాసనాలు అభ్యసించారు. ఈ సందర్భంగా గూడూరు భారతమ్మ మాట్లాడుతూ యోగాకు భారతదేశానికి పుట్టినిల్లు అన్నారు. యోగ చేయడంతో మనసుకు ప్రశాంతత పాటు సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందన్నారు. యోగాకు వయసుతో సంబంధం లేదన్నారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అందరూ యోగ చేయవచ్చన్నారు. ఆయా వయసులకు సంబంధించి, చేయడానికి వీలుగా ఉండే అనువైన యోగాసనాలు ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను భాగంగా చేసుకోవాలని సూచించారు.

## మునుగోడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కృషితోనే
# చౌటుప్పల్ కు అదనపు కోర్టు మంజూరు

- మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు
- చౌటుప్పల్ కోర్టు ప్రభుత్వ న్యాయవాది వాకిటి నరసింహారెడ్డి



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కృషితోనే చౌటుప్పల్ కు అదనపు కోర్టు మంజూరు జరిగిందని చౌటుప్పల్ కోర్టు ప్రభుత్వ న్యాయవాది వాకిటి నరసింహారెడ్డి అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చౌటుప్పల్ లో కేసుల సంఖ్య ఎక్కువగా ఉందని, చౌటుప్పల్ కు అదనపు కోర్టు అవసరం ఉందని, బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అదనపు కోర్టు మంజూరు చేయాలని హైకోర్టుకు పలుమార్లు విన్నవించామన్నారు. దీంతో న్యాయవాదులు ఇచ్చిన విన్నపాలను పరిగణలోకి తీసుకున్న హైకోర్టు ఫిబ్రవరి,2025లో చౌటుప్పల్ లో అదనపు కోర్టు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించడం జరిగిందని తెలిపారు. దాదాపు సంవత్సరంన్నర నుంచి ఆర్థికపరమైన అనుమతుల కోసం పెండింగ్ లో ఉందని తెలిపారు. ఇట్టి విషయాన్ని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి, సంబంధిత మంత్రితో, రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి ఆర్థిక పరమైన అనుమతులను ఇప్పించారని గుర్తు చేశారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చౌటుప్పల్ లో అదనపు జూనియర్ సివిల్ కోర్టును మంజూరు చేస్తూ జీవో నెంబర్ : 44ను శనివారం జారీ చేసిందన్నారు. గతంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చౌటుప్పల్ కోర్టును సందర్శించినప్పుడు చౌటుప్పల్ లో అదనకు కోర్టు, సబ్ కోర్టుల ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. అదేవిధంగా సబ్ కోర్టు విషయంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చౌటుప్పల్ న్యాయవాదులను తన వెంట తీసుకొని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి మాట్లాడారన్నారు. చౌటుప్పల్ లో అదనపు కోర్టు ఏర్పాటు చేయించిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అదనపు కోర్టు ఏర్పాటుతో కేసుల సత్వర పరిష్కారంతో పాటు కక్షిదారులకు, న్యాయవాదులకు మేలు జరుగుతుందన్నారు.

# ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు

* బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ సీసల బస్తిలోని శ్రీ వైష్ణవి దుర్గ దేవాలయంలో జై గురు నవదుర్గ సేవాసమితి ఆధ్వర్యంలో దేవాలయ తృతీయ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం మహా చండి హోమము, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు బ్రహ్మ రథోత్సవము, పల్లకి ఉత్సవము, కుంభ దీపోత్సవం, మహా మంగళ హారతి తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకలకు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ తో పాటు మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ లు ముఖ్య అతిథులుగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీ వైష్ణవి దుర్గా అమ్మవార్ల కరుణా కటాక్షాలు ప్రజలందరిపై సంపూర్ణంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రుద్రా అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, జై గురు నవదుర్గ సేవాసమితి ట్రస్ట్ సభ్యులు శ్రీకాంతాచార్యులు, జైహింద్, రాఘవేందర్, కపిరాజు, రంగనాథ్, కర్ణ, నాయకులు మల్లేష్ గౌడ్, పాపి రెడ్డి, విటల్ ముదిరాజ్, బ్రహ్మానంద చారి, దాసు, రమేష్, ప్రభాకర్, మెట్ల శీను, దాసు, విగ్నేష్, ముంతాజ్, సంతోష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# దేశభద్రత కొరకు యువత ముందుకు రావాలి

: ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్



ప్రజాస్ఫూర్తి, భైంసా: దేశసేవ చేసేందుకు యువత ముందుకు రావాలని ముధోల్ నియోజకవర్గం ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ పిలుపునిచ్చారు. నిర్మల్ జిల్లా భైంసా మండలం దేగాం గ్రామానికి చెందిన మహాగం సంతోష్ ఆర్మీ ఉద్యోగానికి ఎంపిక కావడంతో ఆదివారం భైంసా పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను అభినందించి. శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్మీలో సేవ చేసే అవకాశం దక్కడం గొప్ప అదృష్టమని , దేశ భద్రత కోసం సేవ చేయడం కారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో దేగాం గ్రామ సర్పంచ్ సీరం సుష్మారెడ్డి,సీనియర్ నాయకులు బోయిడి విఠల్ , బద్దం గంగారెడ్డి, చంద్రకాంత్ పటేల్,భోజరం పటేల్ , తదితరుల పాల్గొన్నారు.

# కుంటాలలో అభివృద్ధి పనుల నిర్మాణానికి 66.50 లక్షల నిధులు మంజూరు



ప్రజాస్ఫూర్తి, భైంసా : కుంటాల మండల కేంద్రం అభివృద్ధి పరిచేందుకు రూ.66.50 లక్షలతో సిసి రోడ్లు, డ్రైనేజీలు, నిర్మాణానికి ఉపాధి హామీ నిధులను మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ అన్నారు. ఆదివారం సంబంధిత మంజూరు పత్రాన్ని భైంసా లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కుంటాల సర్పంచ్ గజేందర్ కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశాలి సంఘం నుండి గ్రామపంచాయతీ వరకు రోడ్డు నిర్మాణం కోసం 11 లక్షలు, జిపి నుండి హనుమాన్ టెంపుల్ కు 9లక్షలు ,గజ్జరం ఇంటి నుండి గజ్జలమ్మ టెంపుల్ వరకు 9.5 లక్షలు, సబ్బిడి రమేష్ ఇంటి నుండి గోవర్ధన్ ఇంటి వరకు 12 లక్షల రూపాయల నిధులు,శ్రీనివాస్ ఇంటి నుండి శ్రీకాంత్ ఇంటి వరకు 5.5 లక్షలు నిధులు, రవి ఇంటి నుండి గ్రామపంచాయతీ వరకు 9. 5 లక్షలు, తాటి సోమేశ్వర్ ఇంటి నుండి కటికే గంగాధర్ ఇంటి వరకు 2.5 లక్షలు, రూపాయలు,హన్మాండ్లు ఇంటి నుండి జుట్టు నవీన్ ఇంటి వరకు 3.5 లక్షల నిధులు, గంగారెడ్డి ఇంటి నుండి మేర లింగం ఇంటి వరకు 4 లక్షల రూపాయల నిధులను మంజూరు చేయించినట్లు తెలిపారు. ఒకేసారి పెద్ద మొత్తంలో నిధులు రావడంతో సర్పంచ్ గజేందర్ గ్రామస్తుల తరపున ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

# రామ మందిరంలో పాకశాఖ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని రామ మందిరం నందు పాకశాల లేక భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా దానికి స్పందించిన ఎమ్మెల్యే సొంత నిధుల నుండి పాక శాల నిర్మాణానికి నిధులు వెచ్చించారు. ఆదివారం పాక శాల పనులను మహబూబాబాద్ ఎమ్మెల్యే చేతుల మీదుగా భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ మున్సిపల్ చైర్మన్ గూగులోత్ జ్యోతి రమేష్, మహబూబాబాద్ మున్సిపల్ స్థానిక ,వివిధ వార్డులకు చెందిన కౌన్సిలర్లు ,పట్టణ నాయకులు రామ మందిరం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# పిడుగు పాటుకు రైతు ఎద్దు మృతి.. రూ.1.10 లక్షల ఆస్తి నష్టం



దేవరుప్పుల / జనగామ,ప్రజాస్ఫూర్తి : జిల్లా లోని దేవరుప్పుల మండలం, కడవెండి గ్రామంలో కురిసిన వర్షంతో పాటు పిడుగుపాటు సంభవించడంతో ఓ రైతుకు చెందిన విలువైన ఎద్దు మృ తి చెందింది. వివరాలలోకి వెళ్తే.... గ్రామానికి చెందిన రైతు మందాటి కొండల్ రెడ్డి కి చెందిన సుమారు రూ.1.10 లక్షల విలువ చేసే వ్యవసాయానికి కీలకమైన పశువు మృతి చెందడంతో అతడు తీవ్ర మనోవేదనకు గురైనట్లు స్థానికులు తెలిపారు. ఎద్దు పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటనతో రైతు తీవ్ర ఆవేదనకు గురయ్యాడు. వ్యవసాయ పనుల కోసం, ముఖ్యంగా వర్షాకాలంలో పొలాలు దున్నేందుకు ఇటీవలే ఈ ఎద్దును కొనుగోలు చేసినట్లు రైతు తెలిపారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న సమ యం లో ఎద్దు మృతి చెందడంతో ఆ కుటుంబానికి తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లిం దని కన్నీటి పర్యం తమయ్యాడు. ఈ ఘటన గ్రామంలో విషాదాన్ని నింపింది. రైతు జీవనాధార మైన పశువు కోల్పోవ దంతో గ్రామస్తులు సైతం విచారంవ్యక్తం చేశారు. పిడు గుపాటుతో జరిగిన నష్టా న్ని ప్రభుత్వం గుర్తించి రైతుకు తక్షణ ఆర్థిక సహాయం అందించాలని గ్రామ స్తులు కోరారు.

# ప్రశాంతంగా ముగిసిన నీట్ పరీక్ష



నల్లగొండ,ప్రజాస్ఫూర్తి : ఆదివారం నల్గొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన నీట్ 2026 రీ ఎగ్జామినేషన్ ప్రశాంతంగా ముగిసింది. నీట్ అండర్ గ్రాడ్యుయేట్ పరీక్ష పకడ్బందీగానిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, రెవెన్యూ, పోలీస్, సంబంధిత శాఖల అధికారులు తీసుకున్న ముందస్తు చర్యలు ,ప్రణాళిక ద్వారా పరీక్షను విజయవంతంగా నిర్వహించారు. జిల్లాలో నీట్ పరీక్షకు జిల్లా యంత్రాంగం 7 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసింది.మధ్యాహ్నం పరీక్ష ప్రారంభమైన వెంటనే జిల్లా కలెక్టర్ బి .చంద్రశేఖర్ కేంద్రీయ విద్యాలయ లో ఏర్పాటు చేసిన నీట్ పరీక్ష కేంద్రాన్ని సందర్శించి పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. పరీక్ష కేంద్రంలో అభ్యర్థులకు చేసిన ఏర్పాట్లు, అలాగే అభ్యర్థుల హాజరు ,గైర్హాజరు, పోలీస్ బందోబస్తు, తనికి తదితర అన్ని అంశాలను పరిశీలించడమే కాకుండా, పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఆదివారం నిర్వహించిన నీట్ పరీక్షకు మొత్తం 2065 మంది హాజరు కావలసి ఉండగా, 1782 మంది హాజరయ్యారని, 283 మంది గైరహాజరైనట్లు నీట్ పరీక్ష కోఆర్డినేటర్, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ శ్రీనివాస్ తెలిపారు.

# ప్రతి ఒక్కరూ యోగా వ్యాయామం, ఫిట్నెస్ కు ప్రాధాన్యత ఇవ్వాలి

*** జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**



నల్లగొండ,ప్రజాస్ఫూర్తి : ప్రతిరోజూ 15 నుంచి 20 నిమిషాల పాటు యోగా చేయడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు.ఆదివారం 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పతంజలి సంస్థ, ఆయుష్ శాఖ, జిల్లా క్రీడాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించిన యోగా దినోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాను ప్రపంచానికి పరిచయం చేసిన గొప్ప దేశం భారతదేశమని, నేడు ప్రపంచవ్యాప్తంగా యోగా ప్రాముఖ్యతను గుర్తించి అనుసరిస్తున్నారన్నారు. ప్రస్తుతం శారీరక శ్రమ తగ్గడం, ఆహారపు అలవాట్లలో మార్పుల వల్ల అనేక వ్యాధులు వస్తున్నాయని, యోగా, వ్యాయామం, ఫిట్నెస్కు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.ఈ సందర్భంగా పతంజలి సంస్థ ప్రతినిధి కర్నాటి విజయకుమార్ మాట్లాడుతూ యోగా ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో యోగా గురువులను, సేవలందించిన పలువురిని జిల్లా కలెక్టర్ సన్మానించారు.అనంతరం అంతర్జాతీయ ఒలింపిక్ డే సందర్భంగా నిర్వహించిన ర్యాలీని జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి రమేష్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ హఫీజ్ ఖాన్, వైద్యాధికారి రాహుల్ , జిల్లాక్రీడల అధికారి అక్బర్ అలీ,నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్చంద్ర, పతంజలి సంస్థ శ్యాంసుందర్,ఆయుష్ శాఖ సుభాషిని, స్థానిక కార్పొరేటర్ సుభాష్, క్రీడాశాఖ అధికారులు, ప్రతినిధులు, యోగా గురువులు, విద్యార్థులు, క్రీడాకారులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఫాదర్స్ డే, యోగా దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటిన నైనిక రజువా



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: అంతర్జాతీయ యోగా దినోత్సవం, ఫాదర్స్ డే సందర్భంగా ప్రకృతి హరిత దీక్షకురాలు నైనిక రజువా మొక్కలు నాటి శుభాకాంక్షలు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలోని సెయింట్ మేరీస్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న నైనిక రజువా ఆదివారం కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 15వ డివిజన్ పరిధిలోని శ్రీ సీతారామ హనుమాన్ శివాలయం ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా యోగా గురువులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ యోగా చేయడం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందని అన్నారు.ఫాదర్స్ డే సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ తండ్రి పేరుతో ఒక మొక్కను నాటాలని పిలుపునిచ్చారు. అనంతరం గరిమెళ్లపాడు సర్పంచ్ రాములకు మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# యోగా ద్వారా శారీరక దృఢత్వం తో పాటు మానసిక ప్రశాంతత

జనగామ, ప్రజాస్ఫూర్తి : యోగా ఆరోగ్య కరమైన సమాజ నిర్మాణానికి దోహద పడుతుందని, శారీరకమానసిక ఆరో గ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తుంద ని వక్తలు పేర్కొన్నారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రిన్సిపల్ జూని యర్ సివిల్ జడ్జి జి.శశి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె. సందీప హాజ రయ్యారు. జిల్లా బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు తాళ్లపల్లి రాజయ్య, జన రల్ సెక్రటరీ మన్నె సత్తయ్య ఆధ్వర్యం లో కార్యక్రమం జరిగింది.వేడుకల్లో యోగా ట్రైనర్ సోమయ్య గురూజీ పాల్గొని న్యాయవాదులు,కోర్టు సిబ్బంది తో వివిధ రకాల యోగా ఆసనాలను చేయించి, వాటి ఆరోగ్య ప్రయోజనాల ను వివరించారు. యోగా ద్వారా శారీర క దృఢత్వంతో పాటు మానసిక ప్రశాం తత కూడా లభిస్తుందని ఆయన తెలి పారు. ఈ సందర్భంగా పలువురు వక్త లు మాట్లాడుతూ, నేటి ఉరుకుల పరు గుల జీవితంలో ఒత్తిడిని అధిగమించ డానికి యోగా ఉత్తమ మార్గమని పేర్కొ న్నారు. ప్రతి ఒక్కరూ యోగాను దైనం దిన జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు పానుగంటి శ్రీనివాస్, ముంచాల రవీందర్, ఆర్.ఉప్పలయ్య, గాడిపెల్లి కవిత, స్వాతి, గద్దల అమృత రావు, జి.రాజశేఖర్, మాదాసు శ్రీకాంత్, ఎ. ఉమాపతి తదితరులు, కోర్టు సిబ్బం ది పెద్ద సంఖ్యలో పాల్గొని యోగా ఆస నాలు నిర్వహించారు.

# దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకోవాలి

*** జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ఎం. పరంధామరెడ్డి**




ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: యోగాను ప్రతి ఒక్కరూ తమ నిత్య జీవితంలో భాగంగా చేసుకోవాలని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగా అత్యంత ప్రభావవంతమైన సాధనమని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ఎం. పరంధామరెడి అన్నారు. జిల్లా ఎన్సీసీ యూనిట్, జిల్లా యువజన, క్రీడా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పాల్వంచ మినీ స్టేడియంలో ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 400 మంది యువత, క్రీడాకారులు, ఎన్సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని యోగా సాధన చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి పరంధామరెడ్డితోపాటు ఎన్సీసీ జిల్లా కో-ఆర్డినేటర్, టిటిడబ్ల్యూఆర్జేసీ కొత్తగూడెం ప్రిన్సిపాల్ అనురాధ మాట్లాడుతూ యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప వారసత్వమని పేర్కొన్నారు. నేడు ప్రపంచవ్యాప్తంగా యోగా ప్రాధాన్యత మరింత పెరిగిందని, యోగాను క్రమం తప్పకుండా ఆచరించడం ద్వారా శారీరక, మానసిక ధృఢత్వంతో పాటు వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని తెలిపారు. ఎన్సీసీ 11వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కర్నల్ ఎస్.కె. భద్రా మాట్లాడుతూ యోగాను కేవలం ఒక రోజు కార్యక్రమంగా కాకుండా ప్రతిరోజూ ఆచరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం టిటిడబ్ల్యూఆర్జేసీ, పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నవభారత్ డీఏవీ, ఓబీపీఎస్, కిన్నెరసాని స్పోర్ట్స్ స్కూల్, సింగరేణి విద్యాసంస్థల విద్యార్థులు, కేటీపీఎస్, ఏడీఈ, ఎన్సీసీ అధికారులు, వైద్య నిపుణులు, క్రీడా కోచ్లు కళ్యాణ్, డేనియల్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# యోగాతో శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత సాధ్యం

*** కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**




జనగామ, ప్రజాస్ఫూర్తి : యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన వారసత్వమని, ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆదివారం జనగామలోని నెహ్రూ పార్క్ నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలో సామూహిక యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగా ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతతతో పాటు ఆరోగ్యవంతమైన జీవనం సాధ్యమవుతుందని అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా. మల్లిఖార్జున్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో యోగా శిక్షకులు వివిధ ఆసనాలు, ప్రాణాయామాలు, ధ్యాన పద్ధతులను ప్రదర్శించారు. వందలాది మంది ప్రజలు, విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. డా. మల్లిఖార్జున్ రావు మాట్లాడుతూ యోగా ద్వారా రక్తపోటు, మధుమేహం, ఊబకాయం, గుండె జబ్బులు వంటి జీవనశైలి వ్యాధులను నియంత్రించవచ్చని తెలిపారు. జిల్లా ఆయుష్ కోఆర్డినేటర్ డా. మమత యోగా ప్రాముఖ్యతను వివరిస్తూ, ఇది శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతను కూడా పెంపొందిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, డీసీపీ, బీసీ వెల్ఫేర్ అధికారి, జిల్లా యువజన క్రీడల అధికారి, జిల్లా లేబర్ అధికారి, డిప్యూటీ వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. అశోక్, డా. వాణి, మున్సిపల్ కమిషనర్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, పట్టణ ప్రముఖులు, నర్సింగ్ కళాశాల విద్యార్థులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# యోగ ద్వారా ప్రజలందరూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

*** మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : యోగ ద్వారా ప్రజలందరూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ అన్నారు. మహబూబాబాద్ లోని గిరిజన భవన్ యందు ఆయుష్ డిపార్ట్మెంట్ మహబూబాబాద్ శాఖ వారి ఆధ్వర్యంలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ హాజరై ప్రజలందరికీ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్,మున్సిపల్ చైర్పర్సన్ గుగులోతు జ్యోతి,జిల్లా అధికారులు,పాఠశాల విద్యార్థిని విద్యార్థులతో కలిసి పట్టణంలోని గిరిజన భవన్లో ఆయుష్ డిపార్ట్మెంట్ నోడల్ అధికారి డాక్టర్ కిరణ్ కుమార్, సంబంధిత శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యోగ వేడుకల్లో మహబూబాబాద్ శాసనసభ్యులు యోగ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ "భారతదేశం ప్రపంచానికి అందించిన అద్భుతమైన కానుక యోగా. నిరంతర ఒత్తిడి, పరుగుల జీవితంలో శారీరక దృఢత్వానికి,మానసిక ప్రశాంతతకు యోగా ఒక దివ్యౌషధంలా పనిచేస్తుంది" అని పేర్కొన్నారు.చక్కని ఏర్పాట్లతో యోగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆయుష్ శాఖ, నిర్వాహకులను అభినందించారు.ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు ఉమా మురళి నాయక్, స్థానిక ప్రజా ప్రతినిధులు,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రథోడ్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి దేశీ రామ్ నాయక్, జిల్లా క్రీడల అధికారిని జ్యోతి,డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్,జిల్లా అధికారులతో పాటు స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ దిలీప్, కళాశాలల విద్యార్థిని విద్యార్థులు పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు స్థానిక సేవా సంస్థలు, నోడల్ అధికారి డాక్టర్ పి కిరణ్ కుమార్, రవికుమార్, కన్వీనర్ శ్రవణ్ కుమార్, స్థానిక తహసిల్దార్ రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ వినోద్ కుమార్,వైద్యులు వసుంధర దేవి, సూర్యం ,పూజిత, యోగశిక్షకులు స్పందన,కమల్ సుందర్,రామకృష్ణ, వడ్డెబోయిన శ్రీనివాస్,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# సమయస్ఫూర్తి చాటిన జనగామ పోలీసులు..

*** నీట్ విద్యార్థినికి అండగా నిలిచిన ఖాకీలు.**



జనగామ, ప్రజాస్ఫూర్తి : నీట్ వంటి కీల క ప్రవేశ పరీక్షకు హాజరయ్యేందుకు వచ్చిన ఓ విద్యార్థిని పొరపాటున తప్పుడు పరీక్షా కేంద్రానికి చేరుకోవడం తో తీవ్ర ఆందోళనకు గురైంది. అయితే స్థానిక పోలీసులు సమయస్ఫూర్తితో స్పందించి, ఆమెను అసలు పరీక్షా కేంద్రానికి సకాలంలో చేర్చి ఒక విద్యా సంవత్సరం వృథా కాకుండా కాపాడారు. వివరాల్లోకి వెళ్తే....అశ్విని అనే విద్యార్థినికి పెంబర్తి గ్రామంలోని పరీక్షా కేంద్రం కేటాయించబడింది. అయితే గతంలో పరీక్ష రాసిన అనుభవంతో ఆమె పొరపాటున జనగామ పట్టణంలోని ఏబీవీ డిగ్రీ కళాశాలకు చేరుకుంది. పరీక్ష సమయం సమీపిస్తుండగా హాల్ టికెట్ను పరిశీలించిన పోలీసులు అసలు కేంద్రం పెంబర్తి లో ఉందని గుర్తించి ఆమెకు వివరించారు. దీంతో విద్యార్థిని తీవ్ర ఆందోళనకు గురైంది.వెంటనే విధుల్లో ఉన్న ఎస్ఐ లు భరత్, రతీష్, చెన్న కేశవులు ఈ విషయాన్ని డీసీపీ రాజ మహేంద్ర నాయక్ దృష్టికి తీసుకెళ్లారు. పరిస్థితి అత్యవసరతను గుర్తించిన డీసీపీ విద్యార్థినిని వెంటనే అసలు పరీక్షా కేంద్రానికి చేర్చాలని ఆదేశించారు. డీసీపీ ఆదేశాల మేరకు ఎస్.ఐ చెన్నకేశవులు తన అధికారిక వాహనంలో విద్యార్థినిని ఎక్కించుకుని సైరన్ మోగిస్తూ వేగంగా పెంబర్తి వైపు బయలుదేరారు. పరీక్ష ప్రారంభానికి కేవలం 9 నిమిషాల ముందే ఆమెను సురక్షితంగా పరీక్షా కేంద్రానికి చేర్చడంతో విద్యార్థిని ఊపిరి పీల్చుకుని పరీక్ష రాసే అవకాశం పొందింది. సమయానికి స్పందించి విద్యార్థిని భవిష్యత్తును కాపాడిన ఎస్ఐ చెన్నకేశవు లు, సీఐలు సత్యనారాయణ రెడ్డి,అబ్బ య్యతో పాటు ఈ కార్యక్రమంలో భాగ మైన పోలీసు సిబ్బందిని స్థానికులు అభినందించారు. ఆపద సమయంలో మానవత్వంతో స్పందించిన పోలీసుల సేవాభావాన్ని విద్యార్థులు, తల్లిదండ్రు లు ప్రత్యేకంగా ప్రశంసించారు. "పోలీసు లు కేవలం శాంతిభద్రతల పరిరక్షకులే కాదు.. అవసర సమయంలో ప్రజలకు అండగా నిలిచే నిజమైన మిత్రులు కూడా" అని స్థానికులు కొనియాడారు.

# కరీంనగర్‌లో ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులో మంటలు..

## డ్రైవర్ అప్రమత్తతో 41 మంది సేఫ్

కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అయితే, డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో 41 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటనతో పెను ప్రమాదం తప్పినట్లయింది. వివరాల్లోకి వెళితే.. కరీంనగర్ డిపోకు చెందిన ఎలక్ట్రిక్ బస్సు ఇవాళ ఉదయం 41 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు బయలుదేరింది. బస్సు అలుగునూరు దాటి కాకతీయ కాలువ సమీపానికి చేరుకోగానే ఇంజిన్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. వెంటనే గమనించిన డ్రైవర్ ప్రశాంత్, బస్సును రోడ్డు పక్కన ఆపివేశారు. క్షణాల్లోనే ఆయన బస్సు డోర్‌తో పాటు ఎమర్జెన్సీ ద్వారాన్ని కూడా తెరిచి ప్రయాణికులందరినీ కిందకు దింపేశారు. ప్రయాణికులు కిందకు దిగిన నిమిషాల వ్యవధిలోనే బస్సు మొత్తం మంటల్లో చిక్కుకుని పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు.

# గీత కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి




*** పెండింగ్ లో ఉన్న ఎక్స్గ్రేషియా వెంటనే విడుదల చేయాలి**

*** తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్**

ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: గీత కార్మికుల పెన్షన్ ఎక్స్ గ్రేషియా, లైసెన్స్ సొసైటీల సమస్యలు జూలై లోపు పరిష్కరించాలని లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ధర్మభిక్షం భవనంలో సంఘం సభ్యత్వం నమోదు కార్యక్రమాని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ బొమ్మగాని ధర్మ బిక్షం నేతృత్వంలో అనేక పోరాటాలు చేసి పెన్షన్, లైసెన్స్, ఎక్స్ గ్రేషియాలు సాధించుకున్నామని అది ధర్మభిక్షం పోరాట ఫలితమైన అని కొనియాడారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్ గ్రేషియా చెల్లించకుండా కాలయాపన చేస్తూ గీత కార్మికులపై సవితి తల్లి ప్రేమను చూపిస్తూ నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో వారికి రావాల్సిన 10 కోట్ల రూపాయలు బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆయన హెచ్చరించారు. పెన్షన్ పొందుతున్న గీత కార్మికుడు చనిపోతే ఆ పెన్షన్ ఇతర పెన్షన్ల మాదిరిగా భార్యకు వచ్చేటట్లు ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు. రేగటి లింగయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర కోఆర్డినేటింగ్ సెక్రెటరీ బొమ్మగాని నాగభూషణం, జిల్లా గౌరవ అధ్యక్షులు బొమ్మగాని శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ కోటయ్య, మాజీ కౌన్సిలర్ అనంతుల మల్లేశ్వరి, నియోజకవర్గ కార్యదర్శి బండారం లక్ష్మయ్య, తొట్ల ప్రభాకర్, బూర వెంకటేశ్వర్లు, తొట్ల వెంకన్న, బూర సైదులు, రేగటి సాంబయ్య, పందుల జానయ్య, ఎడెల్లి శ్రీకాంత్, అయితగాని కామేష్, రెడ్డి మల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప సర్పంచ్‌ల హక్కుల సాధనకై జూన్ 25న

# ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: మెదక్ ఉపసర్పంచ్ ల ఫోరం కమిటీ ఏర్పాటు జిల్లా అధ్యక్షుడిగా అనిల్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్రంలోని ఉప సర్పంచ్‌ల హక్కుల రక్షణ వారి సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25 న హైదరాబాద్ లోని ధర్నా చౌక్ (ఇందిరా పార్క్) వద్ద భారీ "మహా ధర్నా" కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఉప సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు బొల్తు కార్తీక్ తెలిపారు. ఆదివారం మెదక్ పట్టణంలోనీ సాయి బాలాజి గార్డెన్ లో జిల్లా ఉప సర్పంచుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు కార్తీక్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ మహా ధర్నా ఉదయం 10:00 గంటలకు ప్రారంభం కానుంది. "ఆత్మ గౌరవమే లక్ష్యం! హక్కుల సాధనే ధ్యేయం!" అనే నినాదంతో ఉప సర్పంచ్ ల ఫోరంతెలంగాణ రాష్ట్రం ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నారు.ఈ మహా ధర్నాను విజయవంతం చేయడం కోసం ఫోరం నాయకులు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేష్ గౌడ్, మహేష్ గౌడ్, జిల్లా అధ్యక్షులు అనిల్ కుమార్, ఉపాధ్యక్షులు నర్సా గౌడ్, కోశాధికారీ గా ఉమామహేశ్వరి, మరియు జిల్లా కార్యదర్శి రాజు లతో పాటు కార్యవర్గంనూ ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా ఉప సర్పంచ్ లు చలో హైదరాబాద్ ధర్నా చౌక్ ఇంద్ర పార్క్ పోస్టర్ ను ఆవిష్కరించారు.అనంతరం రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ ఉప సర్పంచ్‌లకు గతంలో ఉన్న చెక్ పవర్‌ను ప్రభుత్వం వెంటనే పునరుద్ధరించాలన్నారు. ఉప సర్పంచ్‌ల గౌరవ వేతనాన్ని నెలకు రూ. 5000/ లకు పెంచాలన్నారు. వార్డ్ సభ్యుల గౌరవ వేతనాన్ని నెలకు రూ. 3000/ లకు పెంచుతూ ప్రభుత్వం వెంటనే అధికారిక ప్రకటన చేయాలన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉప సర్పంచులు, వార్డు సభ్యులు , ప్రజాప్రతినిధులు అందరూ రాజకీయాలకు అతీతంగా, పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ మహా ధర్నాను జయప్రదం చేయాలని, తమ న్యాయమైన హక్కులను సాధించుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఉపసర్పంచులు పాల్గొన్నారు.

# అర్హులైన ఎస్సీ ఎస్టీ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందజేయాలి

ప్రజాస్ఫూర్తి, భైంసా : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్సీ ఎస్టీ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందజేయాలని తెలంగాణ ఎస్సీ ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కట్కూరి మల్లేష్ అన్నారు. తెలంగాణ ఎస్సీ ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ జిల్లా మహాసభ జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో సంఘ భవనంలో తెలంగాణ ఎస్సీ ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా బాధ్యులు కుంటోల్ల వెంకటస్వామి సభా అధ్యక్షత వహించారు.ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా తెలంగాణ ఎస్సీ ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కట్కూరి మల్లేష్, వ్యవస్థాపక నాయకులు సలహాదారులు ఆరెల్లి మల్లేష్, రాష్ట్ర అధ్యక్షులు కాదేపురం గంగన్న, రాష్ట్ర ఉపాధ్యక్షులు తెడ్డు సాయిలు హాజరయ్యారు. ఈ మహాసభను ఉద్దేశించి కాటుకూరి మల్లేష్ మాట్లాడుతూ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులతో పాటు ఇండ్ల స్థలాలు, బస్సు పాసులు, రైల్వే పాసులు, హెల్త్ కార్డులు అందజేయాలని అన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ స్కూళ్లు కాలేజీలలో ఎస్సీ ఎస్టీ జర్నలిస్టు పిల్లలందరికీ ఉచిత విద్యను అందించాలని అన్నారు.ఇది వరకే పౌర సంబంధాల సమాచార శాఖ ల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నీ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డిని ఐ అండ్ పి ఆర్ కమిషనర్ ముకుంద రెడ్డిని కలిసి పూర్తి వివరాలతో వినతి పత్రం అందజేయడం జరిగిందని అన్నారు. తదుపరి ఇప్పుడు జరగబోయే అక్రిడిటేషన్ కమిటీల సమావేశాల సందర్భంగా తెలంగాణలోని ఎస్సీ ఎస్టీ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందజేసే విధంగా చూడాలని అన్నారు.ఇదివరకు జరిగిన అక్రిడిటేషన్ కమిటీల సమావేశాలలో ఎస్సీ ఎస్టీ జర్నలిస్టులకు తీవ్రమైన అన్యాయం జరిగిందని అన్నారు.కొందరు అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు అక్రమంగా దొంగ దారిన డబ్బులు తీసుకొని అక్రమంగా కార్డులను ఒక్కదోవ పట్టిస్తున్నారని ఆరోపణలు ఉన్నవి. ఇకనుండి ఇలా జరగకుండా అర్హులైన జర్నలిస్టులందరికీ పెద్ద పత్రిక, చిన్న పత్రిక అనే తేడాలు లేకుండా



అక్రిడిటేషన్ హార్డులు అందజేయాలని అన్నారు.లేనిపక్షంలో కలెక్టరేట్ ను డి పి ఆర్ ఓ ఆఫీస్ ను ముట్టడిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎస్సీ ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఈరోల పురుషోత్తం,కామారెడ్డి జిల్లా అధ్యక్షులు కుంటోల్ల యాదగిరి,టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు వెలుమల ప్రభాకర్, ఎస్సీ ఎస్టీ అడ్వకేట్స్ జేఏసీ చైర్మన్ ప్రముఖ న్యాయవాది రత్నం, జిల్లాలోని ఎస్సీ ఎస్టీ జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.మహాసభ అనంతరం జిల్లా కమిటీ నీ ఏకగ్రీవంగాఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులు కొండ రవి, ఉపాధ్యక్షులు గైని భోజన్న, రాస మల్ల భాస్కర్, అబ్బుగారి గౌతమ్,ప్రధాన కార్యదర్శి వాగ్మారే కపిల్ సహాయ కార్యదర్శి సాయినాథ్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సింగిడి అమృత్, కోశాధికారి కడగొల్ల లచ్చిరాం, కమిటీ సభ్యులుగా కారండే గంగాధర్, న్యాయ సలహాదారులుగా ప్రముఖ న్యాయవాది రత్నం, గౌరవ సలహాదారులుగా వెలుమల ప్రభాకర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా ఎన్నికైన వారందరికీ రాష్ట్ర నాయకులు అభినందనలు తెలిపారు.

## చౌటుప్పల్ కోర్టులో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

- తాడూరి పరమేష్



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తాడూరి పరమేష్ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని న్యాయవాదులతో కలిసి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా తాడూరి పరమేష్ మాట్లాడుతూ దైనందన జీవితంలో యోగ కేవలం వ్యాయామం మాత్రమే కాదని, మన శరీరం, మనస్సు, ఆత్మను సమతుల్యం చేసే గొప్ప భారతీయ సంస్కృతి సంపదన్నారు. నేటి పోటి ప్రపంచంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ముఖ్యమన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను దినచర్యలో భాగంగా చేసుకోవాలన్నారు. తద్వారా ప్రతి కుటుంబం ఆరోగ్యంగాతో ఆనందంగా ఉంటారన్నారు. అన్ని వయసుల వారు యోగ సాధన ద్వారా ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పడమటి మహిపాల్ రెడ్డి, సహాయ కార్యదర్శి మక్తల్ నరసింహ, కార్యవర్గ సభ్యుడు ఎండి ఖయ్యూం పాష, మాజీ అధ్యక్షులు ఊడుగు శ్రీనివాస్ గౌడ్, బాల్యం వెంకట చలపతి, న్యాయవాదులు జక్కర్తి శేఖర్, చామట్ల జంగయ్య, సూపరింటెంట్ ఖదీర్, కోర్టు సిబ్బంది ఉమర్, శ్రీధర్ రెడ్డి, రమేష్, భరత్, స్వాతి, వంశీ, ఉదయ్, శంకర్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ ఆర్ ఆర్ డయాగ్నొస్టిక్ సెంటర్ ప్రారంభం



ప్రజాస్ఫూర్తి, భైంసా : నిర్మల్ జిల్లా భైంసా పట్టణం లోని ఎస్ ఆర్ ఆర్ డయాగ్నొస్టిక్ సెంటర్‌ను ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ప్రారంభించారు. భైంసా పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ఆర్ఆర్ డయాగ్నొస్టిక్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పాల్గొన్నారు.ఆయన సెంటర్‌ను ప్రారంభించి,అందులోని వివిధ విభాగాలను సందర్శించి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బైంసా పట్టణంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన వైద్య, నిర్ధారణ కేంద్రాలు అందుబాటులోకి రావడం ప్రజలకు ఎంతో ఉపయోగకరమని,ఇది ప్రాంత అభివృద్ధికి, శుభ సూచకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్‌తో తూమొళ్ళ దత్తు, డాక్టర్ అజయ్ రెడ్డి,డాక్టర్ కైలాష్,డాక్టర్ వనజ, డాక్టర్ ముత్యంరెడ్డి తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు , స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## పలు శుభకార్యాల్లో పాల్గొన్న మాజీ మంత్రి జగదీష్ రెడ్డి



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: సూర్యాపేట పట్టణంలో ఆదివారం నిర్వహించిన పలు శుభకార్యాలకు మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి హాజరై కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. వివిధ కార్యక్రమాల్లో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించడంతో పాటు నూతన దంపతులు, కుటుంబ సభ్యులతో కలిసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని శ్రీ సాయిబాబా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన అడిషనల్ పీపీ నాతి సవిందర్ కుమార్ - లీల దంపతుల కుమార్తె నిశ్చితార్థ కార్యక్రమానికి జగదీష్ రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా ముచ్చటించి కార్యక్రమం విజయవంతంగా జరగాలని ఆకాంక్షించారు. అనంతరం మన్నెం సదాశివరెడ్డి ఫంక్షన్ హాల్‌లో జరిగిన ధావుల వీరప్రసాద్ యాదవ్ - మనీషా ల కుమార్తె, కుమారుడి ల నూతన పట్టు వస్త్రాలంకరణ వేడుకకు హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ పిల్లలు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్, గోపగాని వెంకటనారాయణ, వై. వెంకటేశ్వర్లు, డాక్టర్ ఊర రామూర్తి-గాయత్రి, డాక్టర్ సాల్వది రమేష్ కుమార్, ఎస్ఎస్ఆర్ ప్రసాద్,వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు.

## ఘనంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కె.యం.ప్రతాప్ జన్మదిన వేడుకలు






జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కె.యం.ప్రతాప్ జన్మదినం సందర్భంగా ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజక వర్గం పరిధిలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,వివిధ కాలనీల, బస్తీల సంక్షేమ సంఘం నాయకులు, కార్మిక నాయకులు, కర్షకులు,అభిమానులు తదితరులు, కుత్బుల్లాపూర్ గ్రామంలోని సి.పి.ఆర్. కాలనీలో గల ప్రతాప్ నివాసం వద్ద పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అనంతరం ఆయన చేత కేకును కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జన్మదిన వేడుకలలో భాగంగా, హెచ్.ఎం.టి. కాలనీలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండి రషీద్,ఎండి సిరాజ్ ఆధ్వర్యంలో నిర్మాణ్ డిసేబుల్డ్ ఒకేషనల్ ట్రైనింగ్ కం ప్రొడక్షన్ సెంటర్ లో విద్యార్థులకు పండ్లు,పాలు, బ్రెడ్, ను పంచిపెట్టారు.అనంతరం కుత్బుల్లాపూర్ గ్రామంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలో శ్రీ రామాంజనేయ యువజన సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నందానగర్ లో గల కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు కేక్ ను కట్ చేసి జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ ప్రతాప్ కి జన్మదిన శుభాకాంక్షలను తెలియజేస్తూ, ఎంతో మంది కార్యకర్తలను నాయకులుగా తీర్చిదిద్దిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీలా, బస్తీల సంక్షేమ సంఘం నాయకులు, కార్మిక నాయకులు, కర్షకులు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప సంపద యోగ

* జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్




ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: మెదక్ పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియం ప్రాంగణంలో ఆదివారం ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం - 2026 కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇన్చార్జి అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్, మెదక్ ఆర్డీవో రమాదేవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి భూక్య జ్ఞానేశ్వర్,డిసిహెచ్ఎస్ డాక్టర్ శివదయాల్ , ఆయుష్ విభాగం మోహన్ రెడ్డి, జిల్లా యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్ ,విశిష్ట యోగ గురువు ఆకుల రవి తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు."ఆరోగ్యవంతమైన వృద్ధాప్యం కోసం యోగ" అనే థీమ్‌తో నిర్వహించిన ఈ కార్యక్రమంలో,జిల్లా కలెక్టర్ , ప్రతి మాసింగ్ ఇన్చార్జి.అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్ , మెదక్ ఆర్డీవో రమాదేవి లు స్వయంగా యోగా ఆసనాలు చేస్తూ పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని ఆరోగ్యవంతమైన వృద్ధాప్యం కోసం యోగ" అనే థీమ్ తో ముందుకు సాగాలన్నారు మా నవ శక్తులన్నింటినీ ఏకం చేసే ఏకాగ్రత సాధించడం యోగాకే సాధ్యం అన్నారు. భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప సంపద యోగ అని పిలుపునిచ్చారుఅనంతరం యోగాలో పాల్గొన్న ఆయుష్ అధికారులు, విద్యార్థినీ విద్యార్థులు , క్రీడాకారులు క్రీడాభిమానులతో కలెక్టర్ ఫోటో సెషన్ లో కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ తాసిల్దార్ లక్ష్మణ్ బాబు, విశిష్ట యోగ ఇన్స్ట్రక్టర్ దేవేందర్ రెడ్డి,పిడి ఆనందం , నరసింహులు, కొండల్ రెడ్డి ప్రజా ప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులు, మండల అధికారులు , వైద్య సిబ్బంది, విద్యార్థులు, యువత, మహిళాలు, స్వచ్ఛంద సంస్థలు, యోగా సాధకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా జిల్లాలో నీట్ పరీక్షలు నిర్వహణ

* నీట్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన నీట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగినట్లు కలెక్టర్ ప్రతిమాసింగ్ వెల్లడించారు. జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష నీట్ ఆదివారం మెదక్ ప్రభుత్వ కళాశాలలో నిర్వహించగా పరీక్షా కేంద్రాన్ని అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ మెదక్ ఆర్డీవో రమాదేవి, తాసిల్దార్ లక్ష్మణ్ బాబు, డీఎస్పీ ప్రసన్నకుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ హుస్సేన్ , సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీట్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించడానికి పటిష్ట ప్రణాళిక ద్వారా సమావేశాలు నిర్వహించుకుని వివిధ శాఖల అధికారులకు సూచనలు సలహాలు అందించడం జరిగిందన్నారు.పరీక్ష రాసే అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలవకుండా వసతులు కల్పించినట్లు వెల్లడించారు పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు అభ్యర్థులను ప్రవేశ ద్వారం వద్ద తనిఖీలు నిర్వహించి లోపలికి అనుమతించడం జరిగిందన్నారు. పరీక్షా కేంద్రం వద్ద పోలీస్ యంత్రాంగం 163 బి.ఎన్.ఎస్ చట్టాన్ని పగడ్బందీగా అమలు చేసి పటిష్ట భద్రత నడుమ పరీక్షలు నిర్వహించినట్లు వివరించారు. 481 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా కేవలం 421 మంది మాత్రమే పరీక్షకు హాజరైనట్లు వివరించారు వివిధ కారణాల వల్ల 58 మంది గైర్హాజర్ కావడం జరిగిందని అన్నారు.

## వ్యక్తి దారుణ హత్య

ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: చుంచుపల్లి మండలం పెనగడప గ్రామ పంచాయతీకి చెందిన యువకుడు శనివారం రాత్రి దారుణ హత్యకు గురయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెనగడప గ్రామానికి చెందిన నాగరాజు, శివాజి అనే వ్యక్తికి మధ్య గత రాత్రి పాల్వంచలోని పెద్దమ్మగుడి సమీపంలోగల ఒక ఫంక్షన్ హాల్‌లో పాత కక్షల నేపథ్యంలో గొడవ జరిగింది. గొడవ అనంతరం ఇంటికి వచ్చి నిద్రిస్తున్న నాగరాజుపై శివాజి విచక్షణ రహితంగా కత్తితో దాడి చేయడంతో తీవ్ర రక్తపు మడుగులో ఉన్న నాగరాజును స్థానికులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే పిడి యాక్ట్

* రూరల్ పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి




రఘునాథ్ పల్లి, ప్రజాస్ఫూర్తి : వానకాలం సాగు సీజన్ ఆరంభమైనం దున రఘునాథపల్లి... లింగాల గణపురం.. చిల్పూర్ మండలాలలో రైతులు అప్రమత్తంగా ఉండాలని రూరల్ పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎడబెల్లి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. అదివారం ఆయన మాట్లాడుతూ నకిలీ విత్తనాలు ఎరువులు పట్ల రైతులు అప్రమత్తం చేస్తూ సూచనలు ఆయన తెలిపారు.నకిలీ విత్తనాలు ఎరువులు అమ్మకాలు దొరికితే పీడి యాక్ట్ కేసులు నమోదు చేసి లైసెన్సులు రద్దుచేసి షాపులు సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు.విత్తనాలు ఎరువులు కొనుగోలు విషయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని కొనుగోలు రసీదు... బ్యాచ్ నెంబరు రైతుల వివరాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. ముఖ్యంగా అపరిచితులు గ్రామాలలో సంచరించి నకిలీ విత్తనాలు అమ్మేవారు ఉంటే పోలీసులకు, వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నకిలీ విత్తనాలు ఎరువుల రవణపై నిరంతర నిఘా ఉంటదని ఆయన తెలిపారు .

## ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలు



ప్రజాస్ఫూర్తి, భైంసా : నిర్మల్ పట్టణంలోని అంబేద్కర్ భవన్లో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఆదివారం ఉదయం ఘనంగా నిర్వహించారు. ఈ యోగ వేడుకలలో భాగంగా యోగా శిక్షకులు, ప్రతి యోగాసనం యొక్క ఉపయోగం తెలుపుతూ కార్యక్రమానికి హాజరైన వారితో వివిధ రకాల యోగాసనాలు వేయించారు.యోగ దినోత్సవం రోజు ప్రపంచం మొత్తం యోగాను ఆచరిస్తుందని, ప్రజలంతా నిత్యజీవితంలో యోగాను భాగస్వామ్యం చేసుకోవాలని పిలుపునిచ్చారు. యోగ సాధనతో ఎన్నో రకాల మొండి వ్యాధులు కూడా నయమవుతాయని అన్నారు. ఈ అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకల్లో డిఇఓ భోజన్న, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, నోడల్ అధికారి సత్యనారాయణరావు, ఇతర అధికారులు, సిబ్బంది, శిక్షకులు, పట్టణవాసులు, తదితరులు పాల్గొన్నారు.

## శరీరక మానసిక ఆరోగ్యానికి యోగా అతి ముఖ్యమైనది



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రత్యేక అధికారి బి. భవాని ఆధ్వర్యంలో జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు అధిక సంఖ్యలో పాల్గొని ఎంతో ఉత్సాహంగా వివిధ యోగా ఆసనాలు, ప్రాణాయామాలు చేసి యోగా పట్ల తమ ఆసక్తిని చాటిచెప్పారు.ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి బి. భవాని మాట్లాడుతూ, యోగా మన శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమని, ప్రతి విద్యార్థి రోజువారీ జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని సూచించారు. యోగా ద్వారా ఏకాగ్రత, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని తెలిపారు. కార్యక్రమాన్ని వ్యాయామ ఉపాధ్యాయురాలు జహారా సమర్థవంతంగా నిర్వహించారు. విద్యార్థినులకు వివిధ యోగా ఆసనాలను చేయించి వాటి ప్రాముఖ్యతను వివరించారు.ఈ కార్యక్రమంలో పీజీ సి ఆర్ కు చెందిన మంజుల, సి ఆర్ టి హిమబిందు, ఉపాధ్యాయ బృందం, ఇతర సిబ్బంది పాల్గొని విద్యార్థినులను ప్రోత్సహించారు.

## ప్రీప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాల
# నియామక ప్రక్రియలో సవరణలు

జనగామ, ప్రజాస్ఫూర్తి : సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జిల్లా లోని 39 ప్రభుత్వ, స్థానిక సంస్థల ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ప్రారంభించిన ప్రీప్రైమ రీ విభాగాల కోసం ఇన్‌స్ట్రక్టర్లు, ఆయా ల నియామకానికి సంబంధించిన నిబం ధనల్లో సవరణలు చేసినట్లు జిల్లా కలెక్ట ర్, జిల్లా మేజిస్ట్రేట్ సమగ్ర శిక్ష చైర్మన్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ జారీ చేసిన తాజా మార్గదర్శకాల ప్రకారం పు రుషులు, మహిళలు అనే తేడా లేకుం డా అర్హులైన అభ్యర్థులందరికీ దరఖా స్తు చేసుకునే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. ఎంపిక పూర్తిగా మెరిట్ కమ్ స్థానికత ప్రాతిపదికన నిర్వహించ నున్నట్లు తెలిపారు. జిల్లా లోని 39పాఠ శాలలకు ఒక్కో ప్రీప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్, ఒక్కో ఆయా చొప్పున మొత్తం 78 పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన గౌరవ వేతనంపై భర్తీ చేయనున్నారు. ప్రీప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్‌కు నెలకు రూ. 8, 000, ఆయాకు రూ.6,000 చొప్పున విద్యా సంవత్సరంలో 10 నెలల పాటు గౌరవ వేతనం చెల్లించనున్నారు.ప్రీ ప్రై మరీ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు ఇంటర్మీడియ ట్ ఉత్తీర్ణత, ఆయా పోస్టుకు 7వ తరగ తి ఉత్తీర్ణత అర్హతగా నిర్ణయించారు. వ యస్సు 01.06.2026 నాటికి 18 నుం చి 44 సంవత్సరాల మధ్య ఉండాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం వయో సడలింపులు వర్తిస్తాయని తెలిపారు. ఇప్పటికే జూన్ 1న విడుదల చేసిన ప్రకటన మేరకు దరఖాస్తు చేసిన అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవ సరం లేదని స్పష్టం చేశారు.కొత్తగా ఆస క్తి కలిగిన అర్హులైన అభ్యర్థులు జూన్ 2 2 నుంచి జూలై 3 సాయంత్రం 5 గంటల లోపు సంబంధిత పాఠశాల. ప్రధానోపా ధ్యాయులకు దరఖాస్తులు సమర్పించా లని సూచించారు.పూర్తి వివరాలు,పాఠ శాలల జాబితా,దరఖాస్తు నమూనా సంబంధిత పాఠశాలలు, మండల విద్యాశాఖ కార్యాలయాల్లో అందుబా టులో ఉంటాయని కలెక్టర్ తెలిపారు.

## జన్మదిన వేడుకలలో పాల్గొన్న నాయకులు



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట:సూర్యాపేట పట్టణంలోని రవి మహల్ ఫంక్షన్ హాల్ లో శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి కమిటీ చైర్మన్ పోతుగంటి వెంకటేశ్వర్లు పుట్టినరోజు మరియు మనవరాలి బారసాల కార్యక్రమానికి పలువురు నాయకులు హాజరయ్యారు. చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మోరిశెట్టి నివేదిత లక్షాది , వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, సుధాకర్ పివిసి ఎండి మీలా మహదేవ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కోశాధికారి కక్కిరేణి శ్రీనివాస్, సుదాబ్యాంక్ వైస్ చైర్మన్ కక్కిరేణి చంద్రశేఖర్, జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రదాన కార్యదర్శి ఇమ్మడి సోమనర్సయ్య, పట్టణ ఆర్యవైశ్య సంఘం అద్యక్షులు బెలిదె శ్రీనివాసులు, రాష్ట్ర నాయకులు మీడిదొడ్డి శ్యామ్ సుందర్, కలకోట లక్ష్మయ్య, మీలా వంశి, కర్నాటి రవి, చల్లా లక్ష్మీకాంత్, చల్లా లక్ష్మి ప్రసాద్, పట్టణ ఆర్యవైశ్య సంఘం కమిటీ సభ్యులు, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కౌన్సిలర్ లు పాల్గొన్నారు.

## చెట్టును ఢీకొట్టిన కారు..
# భార్యాభర్తలు, కుమారుడి మృతి

ములకలపల్లి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. ములకలపల్లి మండలం మాదారం అటవీ ప్రాంతంలో ఓ కారు చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందగా.. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ములకలపల్లి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. మృతులను భార్యాభర్తలు సాయికుమార్ (25), సంధ్య (23), వారి కుమారుడు మోక్షిత్ (4)గా గుర్తించారు. సాయికుమార్ తల్లి జ్యోతికి తీవ్రగాయాలు కావడంతో ఆమెను పాల్వంచ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ముసలిమడుగు గ్రామానికి చెందిన వీరు.. ఓ వేడుక కోసం ములకలపల్లిలోని బంధువుల ఇంటికి వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది.

# మిర్యాలగూడ త్రిపుల్ మర్డర్ కేసును ఛేదించిన నల్గొండ జిల్లా పోలీసులు

* సాంకేతిక ఆధారాలతో నిందితుడి అరెస్ట్.
* జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్,




నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : మిర్యాలగూడ పట్టణంలోని కలాల్‌వాడలో ఈ నెల 4వ తేదీన జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో ముగ్గురు సజీవదహనమై మృతి చెందిన కేసును నల్గొండ జిల్లా పోలీసులు అత్యంత చాకచక్యంగా చేదించినట్లు ఎస్పీ శరత్చంద్ర పవర్ తెలిపారు ఆదివారం ఎస్పీ తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ తొలుత ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంగా భావించిన ఈ ఘటన వెనుక పథకం ప్రకారం జరిగిన హత్య ఉన్నట్లు పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి వచ్చిందన్నారు. డీసీఆర్‌బీ డీఎస్పీ జి. రవి పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందాలు ఏర్పడి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలను విశ్లేషించి నిందితుడిని గుర్తించి అరెస్టు చేశారు. దర్యాప్తులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం, ఊళ్ళ పాలెం గ్రామానికి చెందిన కాళహస్తి శిరీష్ కుమార్ (38) ఈ ఘాతుకానికి పాల్పడినట్లు నిర్ధారణ అయిందన్నారు.నిందితుడు గతంలోనే వివిధ ప్రాంతాల్లో దొంగతనాలు, మోసాలకు పాల్పడిన చరిత్ర కలిగి ఉన్నట్లు విచారణలో తేలింది.తెలుగు మ్యాట్రిమోనీ వంటి వివాహ వెబ్‌సైట్ల ద్వారా మహిళలతో పరిచయాలు పెంచుకుని, వారి నమ్మకాన్ని సంపాదించి వివాహం చేసుకోవడం లేదా వివాహం చేసుకుంటానని నమ్మించి ఆర్థిక ప్రయోజనాలు పొందడం నిందితుడి అలవాటుగా మారినట్లు పోలీసులు గుర్తించారు. ఇదే విధంగా బాధితురాలు ధనలక్ష్మితో కూడా పరిచయం ఏర్పరుచుకుని వివాహం చేసుకున్నాడు. కాలక్రమేణా ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో ధనలక్ష్మి అతడిని దూరం పెట్టింది. హాజీపూర్‌లో ఒక మహిళను మోసం చేసిన కేసులో జైలులో ఉన్న సమయంలో తనకు ఎలాంటి సహాయం చేయకపోవడం, బెయిల్ కోసం ప్రయత్నించకపోవడం పట్ల నిందితుడు తీవ్ర ఆగ్రహం పెంచుకున్నాడు. ఈ క్రమంలో ధనలక్ష్మి ,. ఆమె పిల్లలను హత్య చేయాలని ముందుగానే నిర్ణయించుకున్నాడు.తన ప్రణాళికలో భాగంగా నేరానికి కొన్ని రోజుల ముందే పరిస్థితులను పరిశీలించాడు. సంఘటన జరిగిన రోజు ఉదయం తన ఇంటి సమీపంలో ఉన్న యాక్టివా స్కూటీని దొంగిలించి మిర్యాలగూడ వైపు బయలుదేరాడు. మార్గమధ్యలో ఒక ప్లాస్టిక్ క్యాన్ కొనుగోలు చేసి పెట్రోల్ బంకులో పెట్రోల్ నింపించుకున్నాడు. అనంతరం పలు ప్రాంతాల్లో తిరుగుతూ రాత్రి వరకు సమయం గడిపి అనుమానం రాకుండా జాగ్రత్త పడ్డాడు.రాత్రి సమయంలో బాధితుల ఇంటి పరిసరాలను గమనించి అందరూ నిద్రలో ఉన్నారని నిర్ధారించుకున్న తర్వాత ఇంట్లోకి ప్రవేశించాడు. అక్కడ ఉన్న ప్లాస్టిక్ బకెట్‌లో పెట్రోల్ పోసి నిద్రిస్తున్న వారిపై చల్లాడు. అనంతరం అగ్గిపుల్ల గీసి మంటలు అంటించి సంఘటనను ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలా కనిపించేలా ప్రయత్నించాడు. ఈ క్రమంలో మంటలు నిందితుడికి కూడా అంటుకున్నప్పటికీ అక్కడి నుంచి తప్పించుకుని పరారయ్యాడు. బాధితురాలు ధనలక్ష్మి సంఘటన జరిగిన రోజు ఇంట్లో లేకపోవడంతో ప్రాణాపాయం నుంచి తప్పించుకుంది. అయితే ఇంట్లో నిద్రిస్తున్న ఆమె తల్లి వనం చంద్రమ్మ (48), కుమారుడు లక్ష్మణ్ (17), కుమార్తె ప్రణతి (15) మంటల్లో చిక్కుకుని సజీవదహనమై మృతి చెందారు.సంఘటన స్థలంలో లభించిన సూక్ష్మ ఆధారాలు, కాలిపోయిన ఇంటి వెనుక భాగంలో లభించిన పెట్రోల్ వాసన ఉన్న బకెట్, వివిధ ప్రాంతాల్లోని సీసీటీవీ దృశ్యాలు, ప్రయాణ మార్గానికి సంబంధించిన సమాచారం, సాంకేతిక ఆధారాలను విశ్లేషించిన పోలీసులు నిందితుడి కదలికలను గుర్తించి అరెస్టు చేశారు.నిందితుడి వద్ద నుంచి స్కూటీ, పెట్రోల్ క్యాన్, బకెట్, సాక్షికంగా కాలిపోయిన షర్ట్, హెల్మెట్, సెల్‌ఫోన్, ఘటనాస్థలంలో వదిలివెళ్లిన చెప్పులను స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ, వివాహ సంబంధాల కోసం ఉపయోగించే ఆన్‌లైన్ వేదికల ద్వారా పరిచయమయ్యే వ్యక్తుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పూర్తిస్థాయి వివరాలు, నేపథ్యాన్ని నిర్ధారించుకున్న తర్వాతే సంబంధాలు ఏర్పరచుకోవాలని ఆయన పేర్కొన్నారు.ఈ క్లిష్టమైన కేసును అత్యంత వేగంగా ఛేదించిన డీసీఆర్‌బీ డీఎస్పీ జి.రవి, మిర్యాలగూడ I టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎం. నాగభూషణరావు, ప్రొబేషనరీ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్‌లు జి. రాజారాం, నల్లగంతుల శ్రీను, ఎస్. వెంకటేశ్వర్లు, హుస్సేన్, బి. వీరబాబు, జి. నర్సింహా, బి. ప్రసాద్‌లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందిస్తూ ప్రశంసాపత్రాలు మరియు నగదు రివార్డులను ప్రకటించారు.

## నల్లగొండ పాతబస్తీ గౌడ సంఘం
# నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం



నల్లగొండ,ప్రజాస్ఫూర్తి : నల్లగొండ పట్టణంలోని పాతబస్తీ గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం , నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్ల సన్మాన కార్యక్రమం గౌడ సంఘ భవనం వద్ద ఘనంగా నిర్వహించారు. గౌడ పెద్దలు బైరగోని రాజయ్య గౌడ్ మాట్లాడుతూ ప్రతి వార్డులో గౌడ సంఘ కమిటీలను ఏర్పాటు చేసి గౌడ ఐక్యతను మరింత బలోపేతం చేయాలని, సామాజిక సేవా కార్యక్రమాల్లో అందరూ ముందుండాలని పిలుపునిచ్చారు.గౌడ పెద్దలు తండు సైదులు గౌడ్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ప్రధాన కూడలిలో ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా దివంగత కందుల యాదగిరి గౌడ్ స్మారకార్థం వారి సతీమణి కందుల నిర్మలమ్మ గౌడ్, కుమారులు బాలరాజు గౌడ్, రమణ గౌడ్‌లు గౌడ సంఘ భవన నిర్మాణానికి సహకరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గౌడ కార్పొరేటర్లు రేగట్టే అండాలు లింగస్వామి గౌడ్, గోపగోని స్వాతి రాజశేఖర్ గౌడ్, పాలకూరి సుమలత సంతోష్ గౌడ్‌లతో పాటు స్థానిక కార్పొరేటర్ గుండబోయిన పుష్పలత వెంకన్న యాదవ్ గారు, అక్కనపల్లి రేవతి, బలరాం గారు, మామిడి కార్తీక్ గౌడ పెద్దలు పుల్లెంల యాదగిరి గౌడ్ సురిగి వెంకన్న గౌడ్ హాజరై నూతన కమిటీకి అభినందనలు తెలిపారు. నూతన కమిటీలో అధ్యక్షుడిగా పెద్దగోని సురేష్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా బోయపల్లి వెంకటేశ్వర్లు గౌడ్‌తో పాటు పుల్లెంల రాము గౌడ్, చెన్నగోని లింగస్వామి గౌడ్, బోయపల్లి మధు గౌడ్, కొమ్మగోని సతీష్ గౌడ్, ఐతగోని రమేష్ గౌడ్, వాయుల నాగరాజు గౌడ్, అనంతల యాదగిరి గౌడ్, ఐతగోని గణేష్ గౌడ్ తదితరులు బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో యువకులు, గౌడ సంఘ సభ్యులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## జిల్లా కోర్టు ఆవరణలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఆదివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా సీనియర్ సివిల్ న్యాయమూర్తి, సంస్థ కార్యదర్శి శాలిని షాకెల్లి మరియు అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ అర్వపల్లి కృష్ణతేజ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నేటి ఒత్తిడితో కూడిన జీవన విధానంలో శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ న్యాయవ్యవస్థలో నిరంతరం ఒత్తిడితో పనిచేసే న్యాయవాదులకు, సిబ్బందికి మనశ్శాంతిని, ఉల్లాసాన్ని ఇవ్వడానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ యోగాసనాలు, ప్రాణాయామం , ధ్యానంపై ప్రత్యేక శిక్షణ ఇచ్చిన యోగా శిక్షకుడు కుదురుపాక వివేకను న్యాయమూర్తులు శాలువాతో సత్కరించి పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా ఒక మొక్కను బహూకరించారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొంపల్లి వెంకటయ్య, గవర్నమెంట్ ప్లీడర్ నగేష్ కుమార్, జిల్లా కోర్టు ముఖ్య పరిపాలన అధికారి ఎస్.ఎస్.పి శ్రీనివాస్, న్యాయశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పోలేపల్లి శ్రీనివాస్, సూపరింటెండెంట్లు పూస శ్రీనివాస్, నరసింహమూర్తి మరియు డోలి అనిల్ కుమార్ న్యాయశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

# తెలంగాణలో ఉత్సాహంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా యోగా వేడుకలు ఉత్సాహంగా సాగుతున్నాయి.
ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు, విద్యార్థులు, సామాజిక సంస్థల ప్రతినిధులు భారీగా పాల్గొని వివిధ యోగాసనాలు చేశారు. సూర్యోదయం సమయంలో పార్కులు, స్టేడియాలు, పాఠశాలలు, కళాశాలల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించారు.
ఈ కార్యక్రమాల్లో ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

















# 'అయోధ్యను వీడి వెళ్లొద్దు'.. ట్రస్ట్, ఆలయ సిబ్బందికి సిట్ ఆదేశాలు

ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్య రామాలయంలో కానుకలు, నిధుల దుర్వినియోగం ఆరోపణలపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తన విచారణను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా అయోధ్యను వీడి వెళ్లొద్దని ఆలయ సిబ్బందిని, ట్రస్ట్ నిర్వాహకులను ఆదేశించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ట్రస్ట్ సభ్యులు తదితరులను విచారించిన వివరాలు, ఇతర అంశాలతో కూడిన నివేదికలను దర్యాప్తు అధికారులు డిజిటల్ రూపంలో భద్రపర్చుతున్నారని, అదే సమయంలో రోజువారీగా సీఎం కార్యాలయానికి పంపుతున్నట్లు చెప్పాయి. రామమందిర ట్రస్ట్ చేపట్టిన భూ కొనుగోళ్లు, ఆలయ నిర్మాణ సామగ్రి సేకరణ అంశాలపైనా సిట్ దృష్టి సారించినట్లు సమాచారం. మార్కెట్ ధర కంటే ఎక్కువ రేటుకు భూములను ట్రస్ట్ కొనుగోలు చేసిందనే ఆరోపణల నేపథ్యంలో ఈమేరకు చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది.



ఆలయంలోని నిఘా వ్యవస్థలు, భద్రత నిర్వహణను సిట్ బృందం ఇప్పటికే పరిశీలించింది. అయితే, 45 రోజుల ఫుటేజీ మాత్రమే అందుబాటులో ఉండటం సవాల్‌గా మారింది. సీసీటీవీ ఫుటేజీలను తారు మారు చేశారనే ఆధారాలను కూడా అధికారులు గుర్తించారని.. డిలీట్ చేసిన, మార్చిన డేటాను తిరిగి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని సంబంధిత వర్గాలు తెలిపాయి. అయోధ్య రామాలయానికి వచ్చిన విరాళాల దుర్వినియోగం, ఆర్థిక అవకతవకల ఆరోపణలపై యూపీ ప్రభుత్వం ఈ నెల 13న సిట్ ఏర్పాటు చేసింది. ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, ఆలయ సిబ్బంది తదితరులను దర్యాప్తు అధికారులు ఇటీవల ప్రశ్నించారు. విరాళాల మొత్తాలను గురించి, ఆలయంలో వాటి నిర్వహణ కోసం చేసిన ఏర్పాట్ల గురించి ఆరా తీశారు. విరాళాలకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఆలయ సిబ్బంది వాంగ్మూలాల్లో అనేక వైరుధ్యాలు ఉన్నట్లు గుర్తించారు.

## మైనర్‌తో పెళ్లికి రెడీ.. పట్టించిన ప్రీవెడ్డింగ్ షూట్!

ఇటీవలి కాలంలో వివాహానికి ముందు కాబోయే వధూవరులు ఫొటో షూట్‌లు, రీల్స్ తీసుకోవడం.. వాటిని సోషల్ మీడియాలో పోస్టు చేసే ట్రెండ్ కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. ఓ 15 ఏళ్ల బాలిక వివాహానికి సంబంధించిన ప్రీవెడ్డింగ్ షూట్ సామాజిక మాధ్యమాల్లో కనిపించడంతో అప్రమత్తమైన అధికారులు.. వివాహాన్ని అడ్డుకున్నారు. బీడ్ జిల్లా గెవరాయీ మండలానికి చెందిన 23 ఏళ్ల యువకుడికి 15 ఏళ్ల అమ్మాయితో ఇటీవల వివాహం నిశ్చయమైంది. వీరు ప్రీవెడ్డింగ్ షూట్ కూడా పూర్తి చేసుకున్నారు. అయితే,



సోషల్ మీడియాలో వీటికి సంబంధించిన ఫొటోలు కనిపించడం జిల్లా కలెక్టర్ వివేక్ జాన్సన్ దృష్టికి వచ్చింది. తక్షణమే స్పందించిన ఆయన.. మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారులను అప్రమత్తం చేశారు. రంగంలోకి దిగిన అధికారులు మైనర్ అమ్మాయి గ్రామానికి చేరుకున్నారు. అయితే, అమ్మాయి చేతిపై వరుడి పేరుతో ఉన్న గోరింటాకు తప్ప వివాహం జరిగినట్లు ఎక్కడా ఆనవాళ్లు కనిపించలేదు. దీంతో వివాహం జరగలేదని అధికారులు నిర్ధరించుకున్నారు. పెళ్లికి ముందు తీసుకున్న ఫొటో షూట్‌ను పరిగణనలోకి తీసుకొని, తదుపరి ఏర్పాట్లను అడ్డుకున్నారు. మైనర్ బాలికను సంరక్షణలోకి తీసుకొని, దర్యాప్తు చేపట్టారు. ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్న వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

## రెండు మార్కులతో జేఈఈ అడ్వాన్స్ దూరం..కట్ చేస్తే ఇస్రో శాస్త్రవేత్త

ఏదైనా సాధించాలనే తపన ఉంటే కచ్చితంగా విజయం సాధిస్తాం. ఇందుకు ఉదాహరణగా నిలిచాడు మేరఠ్ యువకుడు. ఒకప్పుడు కేవలం రెండు మార్కుల తేడాతో జేఈఈ అడ్వాన్స్ అర్హత కోల్పోయాడు. ఆ సమయంలో నిరాశ పడినా వెనుకడుగు వేయలేదు. స్వయంకృషితో ఇస్రో శాస్త్రవేత్తగా ఎదిగాడు. ప్రస్తుతం అతడు సాధించిన విజయం తోటివారికి స్ఫూర్తిగా నిలుస్తోంది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని మేరఠ్‌కు చెందిన సంకేత్ కుమార్ 2021లో రెండు మార్కుల తేడాతో జేఈఈ అడ్వాన్స్ అర్హత కోల్పోయాడు. ఏడాది వృథా అయినా అనుకున్నది సాధించాలని అనుకున్నాడు. ఖరీదైన కోచింగ్ సెంటర్లకు వెళ్లకుండా స్వయం కృషితో తిరిగి సాధన ప్రారంభించాడు. అనుకున్నట్టే తదుపరి ఏడాదిలో జేఈఈ మెయిన్, జేఈఈ అడ్వాన్స్ రెండింటిలోనూ అర్హత సాధించాడు. ఆ తర్వాత కేరళలోని తిరువనంతపురం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ టెక్నాలజీలో ప్రవేశం పొందాడు. అకౌస్టిక్స్, వైబ్రేషన్ ప్రత్యేక కోర్సును ఎంపిక చేసుకొని పలు ఇంజినీరింగ్ ప్రాజెక్టుల్లో పనిచేశాడు. విదేశాలకు వెళ్లి అంతర్జాతీయ





అనుభవాన్ని గడించాడు. తన ప్రతిభను గుర్తించిన ఇస్రో శాస్త్రవేత్తగా ఎంపిక చేసింది. బలమైన ఆశయం, పట్టుదల ఉంటే యువత ప్రతి కలను సాకారం చేసుకోగలదని సంకేత్ నిరూపించాడు.

## ఎట్టకేలకు మొదలైన చర్చలు.. మరోవైపు ఇరాన్‌కు ట్రంప్ వార్నింగ్

అమెరికా, ఇరాన్‌ల మధ్య యుద్ధం శాశ్వత ముగింపు కోసం స్విట్జర్లాండ్ వేదికగా ఎట్టకేలకు చర్చలు మొదలయ్యాయి. అమెరికా తరఫున ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఇరాన్ తరఫున పార్లమెంట్ స్పీకర్ ఘాలిబాఫ్ బృందాలు ఇందులో పాల్గొన్నాయి. పాకిస్థాన్, ఖతార్ ప్రతినిధులు మధ్యవర్తిత్వం వహిస్తున్నారు. అదే సమయంలో ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలు జారీ చేశారు. లెబనాన్‌లో సమస్యలు సృష్టించకుండా అక్కడి 'ప్రాక్సీ'లను వెంటనే నిలువరించాలని సూచించారు. లేనిపక్షంలో ఇరాన్‌పై మరోసారి భీకర స్థాయిలో విరుచుకుపడతామని 'ట్రూత్ సోషల్'లో పోస్టు పెట్టారు. చర్చల ప్రారంభానికి ముందు జేడీ వాన్స్ మాట్లాడుతూ.. హర్మూజ్ జలసంధిని తెరవడం, ఇరాన్ అణు కార్యక్రమానికి ముగింపు పలకడం వంటివన్నీ ఇప్పటికే పూర్తయ్యాయని చెప్పారు. "మనం ఇంకా ఎంత





సాధించగలం? పశ్చిమాసియాకు సంబంధించి కొత్త అధ్యాయాన్ని ప్రారంభించగలమా? ఇక్కడి సంబంధాలను శాశ్వతంగా మార్చగలమా? లేదా పాత పద్ధతిలోనే వెళ్లడమా?" అనే ప్రశ్నలు తమందరి ముందు ఉన్నాయన్నారు. ఈ చర్చలను చరిత్రాత్మకంగా పేర్కొంటూ.. ఇరుదేశాల మధ్య ఇంతటి ఉన్నత స్థాయి సమావేశం గతంలో ఎప్పుడూ జరగలేదని చెప్పారు. అమెరికా, ఇరాన్ మధ్య రెండు రోజుల క్రితమే చర్చలు ప్రారంభం కావాల్సి ఉండగా.. వాయిదా పడ్డాయి. తాత్కాలిక ఒప్పందం కుదిరిన కొన్ని గంటలకే ఇజ్రాయెల్ (Israel), లెబనాన్‌లోని హెజ్‌బొల్లా మధ్య పోరాటం తీవ్రతరమైంది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో పదుల కొద్దీ స్థానికులు మృతి చెందారు. ఈ దాడులను నిరసిస్తూ ఇరాన్ ప్రతినిధులు స్విట్జర్లాండ్ ప్రయాణాన్ని రద్దు చేసుకున్నారు.



## రొయ్యల పరిశ్రమలో గ్యాస్ లీక్..
## ఇద్దరు మహిళల మృతి

తమిళనాడు తిరువళ్లూర్‌లోని ఓ ప్రైవేటు రొయ్యల ప్రాసెసింగ్ ప్లాంట్‌లో తీవ్ర ప్రమాదం చోటుచేసుకుంది. అమ్మోనియా గ్యాస్ లీకైన ఘటనలో ఇద్దరు మహిళలు ప్రాణాలు కోల్పోయారు. మరో 60 మందికి పైగా కార్మికులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. బాధితులను స్థానిక ఆసుపత్రుల్లో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. అయితే, వీరిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఘటనా ప్రాంతంలో పర్యటించిన స్థానిక కలెక్టర్ బాధిత కార్మికులను పరామర్శించారు. ఈ ప్రమాదంపై పూర్తి స్థాయి దర్యాప్తునకు ఆదేశించారు. ఈ ఘటనపై తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించాలని సంబంధిత మంత్రులను ఆదేశించారు. ఈ ఘటనలో ఫ్యాక్టరీ యజమానితో పాటు మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది.




## డ్రగ్స్ ఉన్నాయనుకొని దాడి చేస్తే..
## ఇంట్లో పికాసో పెయింటింగ్..!

ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో మాదక ద్రవ్యాల నియంత్రణ అధికారులు జరిపిన దాడిలో వారికి ఊహించని వస్తువు ఒకటి బయటపడింది. పారిస్‌లో ఓ ఇంట్లో మాదకద్రవ్యాలు ఉన్నాయన్న అనుమానంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. వారికి అక్కడ ప్రఖ్యాత చిత్రకారుడు పికాసో పెయింటింగ్ ఒకటి బయటపడింది. దీంతోపాటు కొంత గంజాయి, విలాసవంతమైన దుస్తులు, వేల యూరోల సొమ్ము కూడా లభించింది. పికాసో చిత్రాన్ని వారు పారిస్‌లోని ఓ స్టోరేజీ సైటు నుంచి అపహరించినట్లు పోలీసులు వెల్లడించారు. కానీ, ఎప్పుడు దొంగిలించారో మాత్రం వెల్లడించలేదు. ఇది అసలైన పెయింటింగే అని నిపుణులు తెలిపారు. ఆ పెయింటింగ్ ఒక్కటే కొన్ని లక్షల యూరోల విలువ చేస్తుందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెప్పారు.ఈ కేసుకు సంబంధించి నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. ఈ చిత్రం దొంగతనంపై ప్రత్యేకంగా దర్యాప్తు చేపట్టారు.

## సవాళ్ల స్వాగతం.. యుద్ధం ఆగినా ఇరాన్‌కు ఆర్థిక అడ్డంకులెన్నో..

- **గాడిన పడటానికి చాలా సమయం పట్టవచ్చు**
- **ఎగుమతులు మళ్లీ సాధారణ స్థితికి రావాలి**

యుద్ధం ఆగింది. ఇరాన్ ఊపిరి పీల్చుకుంది. ప్రజలు వీధుల్లో స్వేచ్ఛగా తిరగగలుగుతున్నారు. కానీ ఇప్పుడే ఆ దేశానికి అసలు సవాళ్లున్నాయి. అస్తవ్యస్తంగా మారిన ఆర్థిక వ్యవస్థను గాడినపెట్టడం ఇందులో అతి పెద్ద సవాలు. అందుకోసం గతంలోలా ఎగుమతులను పెంచుకోవాల్సి ఉంది.






**ఆంక్షల సడలింపుతో..**

యుద్ధం తాత్కాలిక ముగింపు ఒప్పందంలో భాగంగా ఇరాన్‌పై ఆంక్షల ఎత్తివేతతోపాటు విదేశీ పెట్టుబడులకు అనుమతి లభించనుంది. అయితే మరిన్ని ఆర్థిక వెసులుబాట్ల విషయంలో ఇంకా అనిశ్చితి కొనసాగుతోంది. చర్చల సందర్భంగా వాటిపై ఒప్పందం కుదిరినా ఎన్నో సంక్లిష్టతలు తప్పవు.

**బలపడిన రియాల్**

యుద్ధం ముగియగానే ఇరాన్ కరెన్సీ రియాల్ బలపడింది. యుద్ధం సందర్భంగా డాలరు 1.8 మిలియన్ రియాల్స్‌వద్ద ట్రేడ్‌కాగా.. ఇప్పుడది 1.57 మిలియన్ రియాల్స్‌వద్ద ఉంది. అయినా యుద్ధాని కంటే ముందునాటి కంటే 18శాతం అధికంగా ఉంది.

**స్తంభింపజేసిన ఆస్తులు వచ్చేనా..**

ప్రపంచ దేశాల్లో ఇరాన్‌కు 24 బిలియన్ డాలర్ల ఆస్తులున్నాయి. వాటిని అమెరికా స్తంభింపజేసింది. ఇందులో సగం రానున్న రెండు నెలల్లో విడుదల చేసే అవకాశముంది. శుద్ధి చేసిన యురేనియం తరలింపునకు ఇరాన్ అంగీకరిస్తే ఖతార్ బ్యాంకుల్లో ఉన్న 6 బిలియన్ డాలర్లను విడుదల చేసే అవకాశముంటుంది. వాటిని మానవతా సాయం, వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలుకు ఇరాన్ వినియోగించుకునే అవకాశముంది.

**బ్యాంకింగ్ రంగంలో..**

ఇరాన్‌లోకి ప్రధాన చమురు కంపెనీలను అమెరికా అనుమతించినా.. అంతర్జాతీయ ఆర్థిక సేవల వ్యవస్థ సహకరించే అవకాశాలు తక్కువ. ఎందుకంటే రాజకీయ నిర్ణయాలు వెంటనే పెట్టుబడులను ప్రభావితం చేయలేవు. ప్రధాన బ్యాంకులేవీ అంత త్వరగా ఇరాన్ వ్యాపారం చేసే రిస్కును తీసుకోలేవు. ఇప్పటికే ఇరాన్ ఎఫ్ఏటీఎఫ్ బ్లాక్ లిస్టులో ఉంది. దానిని తొలగించాలంటే అనేక వెరిఫికేషన్లు చేయాలి. దీనికి చాలా సమయం పడుతుంది.

**రష్యా సాయమూ అంతంతే..**

పాశ్చాత్య దేశాల కంపెనీలు దూరమైనప్పుడల్లా రష్యావైపు ఇరాన్ చూసేది. అయితే గత రెండు దశాబ్దాల్లో ఆ దేశం పెద్దగా సాయపడలేదు. అంతర్జాతీయ ఇంధన మార్కెట్లో ఇరాన్ ఎదగడానికి రష్యా అంతగా సహకరించే అవకాశం కనిపించడంలేదు.

**చమురు రవాణాలో..**

యుద్ధానికంటే ముందు 1.5 మిలియన్ బ్యారెళ్ల చమురును ఇరాన్ ఎగుమతి చేసేది. ఆంక్షలను ఎత్తివేస్తే రోజుకు 2.5 మిలియన్ బ్యారెళ్లను ఎగుమతి చేయవచ్చు. గత ఏడాది ఆ దేశం చమురు ఎగుమతుల ద్వారా 46.7 బిలియన్ డాలర్లను ఆర్జించింది. ఆంక్షలను ఎత్తివేస్తే అది మరింత పెరిగే అవకాశముంది. అయితే అది అంత వేగంగా సాధ్యం కాకపోవచ్చు. 38 శాతం పెట్రో ఉత్పత్తులను ఎగుమతులు చేసే పర్షియన్ గల్ఫ్‌లోని 6 పెట్రోకెమికల్ కాంప్లెక్సులు ధ్వంసం కావడంతో ప్రస్తుతం అవి 13శాతానికి పరిమితమయ్యాయి.

- **చమురు వ్యాపారంలో స్థిరంగా ఉత్పత్తి చేయడం, పెట్టుబడులను ఆకర్షించడం, ఆధునిక సాంకేతికతలను అందిపుచ్చుకోవడం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో అనుసంధానం కావడం అత్యంత ముఖ్యమైనవి. వీటిలో ఇరాన్ ఎంతవరకు విజయం సాధిస్తుందనేది ఆసక్తికరం.**
- **ఇరాన్ చమురు క్షేత్రాలు పురాతనమైనవి. వాటిలో ఇప్పటికే ఉత్పత్తి తగ్గిపోయింది.**

ఒకవేళ రాజకీయ అడ్డంకులు వెంటనే తొలగిపోయినా.. చమురు పరిశ్రమల్లో ఇంజినీరింగ్, నిర్మాణ పనులకు ఏళ్లు పట్టవచ్చు. అలా చేసినా ఇప్పుడు ప్రపంచ దేశాలేవీ ఇరాన్ చమురు కోసం ఎదురుచూడటం లేదు. ప్రత్యామ్నాయ మార్గాలను అవి చూసుకున్నాయి.

**ఎగుమతిదారే.. దిగుమతిదారుగా..**

పెట్రో కెమికల్, స్టీల్ పరిశ్రమల ద్వారా ఇరాన్‌కు భారీగా ఆదాయం వచ్చేది. యుద్ధం కారణంగా ఆ పరిశ్రమలు ధ్వంసమయ్యాయి. దీంతో సంప్రదాయంగా తాను ఎగుమతి చేసే ఈ ఉత్పత్తులను ఇప్పుడు ఆ దేశం దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది.

**పునర్నిర్మాణ నిధులు అందేనా..**

ఇరాన్ పునర్నిర్మాణానికి 300 బిలియన్ డాలర్ల పెట్టుబడుల అంశం ఎంతో కీలకం. అరబ్ దేశాలకు చెందిన కంపెనీలు.. ఎంతవరకు పెట్టుబడులు పెడతాయనేది అనుమానమే. గతంలో ఇలాంటి నిధులను ప్రభుత్వాలు అందించేవి. కానీ ఇప్పుడు ఆ భారాన్ని ప్రైవేటు సంస్థలపై పెట్టారు.





## • త్రిప్తి డిమ్రి

బాలీవుడ్‌లో ఇప్పటికే మంచి గుర్తింపు తెచ్చుకున్న త్రిప్తి డిమ్రి తెలుగులోకి ఎంట్రీ ఇవ్వనుంది. బాలీవుడ్ యానిమల్‌తో ఓవర్‌నైట్‌లోనే క్రేజ్‌ను సొంతం చేసుకున్న త్రిప్తి.. దర్శకుడు సందీప్ వంగా తెరకెక్కిస్తున్న స్పిరిట్‌లో ప్రభాస్ సరసన నటిస్తోంది. నటనతో విమర్శకుల నుంచి ప్రశంసలు అందుకుంది. నానీ హీరోగా తెరకెక్కనున్న మూవీలోనూ హీరోయిన్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది.






## • రషా తడానీ

బాలీవుడ్ హీరోయిన్ రవీనా టాండన్ కూతురు రషా తడానీ టాలీవుడ్‌లోకి అడుగుపెట్టబోతుంది. అజయ్ భూపతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'శ్రీనివాస మంగాపురం' చిత్రంతో హీరోయిన్‌గా పరిచయం అవుతోంది. ఇది ఒక ప్రేమకథా చిత్రం కావడంతో యంగ్ బ్యూటీకి నటనకు మంచి స్కోప్ ఉంటుందని భావిస్తున్నారు. రషా తడానీ సినిమాలు చేయలేదు. కానీ, ఆజాద్ మూవీలో స్పెషల్ సాంగ్‌లో అలరించింది. సోషల్ మీడియాలో రషాకు మంచి ఫాలోయింగ్ ఉంది. ఓ వైపు కుటుంబ నేపథ్యం ఉన్నప్పటికీ.. తన ప్రతిభతో సత్తాచాటాలని భావిస్తోంది.

## • ఇమాన్వీ ఇస్మాయిల్

ఇమాన్వీ ఇస్మాయిల్ తొలిసారిగా సినిమా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టబోతుంది. దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న 'ఫౌజి' చిత్రంతో టాలీవుడ్‌లోకి పరిచయమవుతోంది. ఈ మూవీ పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతుండగా.. ప్రభాస్ సరసన నటించనుంది. పాన్ ఇండియా సినిమాతోనే ఎంట్రీ ఇవ్వనుండడం విశేషం. మోడలింగ్‌తో పాటు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా చేసింది. డ్యాన్సర్ కం కొరియోగ్రాఫర్‌గా పని చేసింది.

## • వీణా రావు

కూచిపూడి నృత్యకారిణిగా మంచి పేరు తెచ్చుకున్న వీణా రావు.. సినిమాల్లోకి అడుగుపెడుతోంది. నందమూరి తారకరామారావు నటిస్తున్న మూవీతో హీరోయిన్‌గా పరిచయం అవుతోంది. ఈ మూవీకి ప్రముఖ దర్శకుడు వైవీఎస్ చౌదరి తెరకెక్కిస్తున్నారు. సంప్రదాయ కళల్లో నైపుణ్యం ఉన్న ఆమె, అదే ఎక్స్‌ప్రెషన్‌ను నటనలో కూడా చూపిస్తుందా అనే ఆసక్తి నెలకొన్నది. తెలుగు అమ్మాయిగా ఆమెకు మద్దతు లభించే అవకాశం ఉంది.

# టాలీవుడ్‌లోకి మెరుపుతీగలు!





**తెలుగు సినిమా ఇండస్ట్రీ కొత్త హీరోయిన్లకు రెడ్‌కార్పెట్‌తో స్వాగతం పలుకుతోంది. ఇప్పటికే ఎంతో మంది తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. ఇందులో కొందరు సక్సెస్ ఫుల్‌గా కెరీర్‌ను కొనసాగిస్తుండగా.. మరికొందరు సరైన హిట్స్ లేక వెనుకపడిపోయారు. తాజాగా మరికొందరు యంగ్ బ్యూటీలు సైతం టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. కొందరు తొలిసారిగా సినిమారంగంలోకి ఎంట్రీ ఇస్తుండగా.. మరుకొందరు ఇతర భాషా చిత్రాల్లో నటించినా.. తెలుగు తెరకు తొలిసారి పరిచయమవుతున్నారు. ఇంతకీ ఆ హీరోయిన్లు ఎవరో తెలుసుకుందాం..!**

## • ఏక్తా రాథోడ్

కన్నడ నుంచి తెలుగులోకి ఎంట్రీ ఇస్తున్న మరో బ్యూటీ ఏక్తా రాథోడ్. ఇప్పటికే ఎంతోమంది కన్నడ ఇండస్ట్రీ నుంచి తెలుగు తెరకు పరిచయ మయ్యారు. విశ్వక్ సేన్ హీరోగా తెరకెక్కుతున్న 'లెగసీ' మూవీతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇవ్వబోతోంది. కమర్షియల్ ఎలిమెంట్స్‌తో కూడిన ఈ సినిమాలో ఆమె గ్లామర్‌తో పాటు నటనకు కూడా ప్రాధాన్యం ఉన్న పాత్రలో కనిపించనుంది. ఇతర భాషల్లో నటించిన అనుభవం ఉండడంతో ఏక్తాకు టాలీవుడ్‌లో ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.

## • సాత్విక వీరవల్లి

టాలీవుడ్‌లోకి తొలిసారిగా ఎంట్రీ ఇస్తోంది సాత్విక వీరవల్లి. దుల్కర్ సల్మాన్ నటిస్తున్న 'ఆకాశంలో ఒక తార' చిత్రంతో హీరోయిన్‌గా ఎంపికైంది. ఈ సినిమాను రెండు పెద్ద నిర్మాణ సంస్థలు కలిసి నిర్మిస్తున్నాయి. దాంతో ఈ బ్యూటీకి ఈ మంచి లాంచ్‌గా భావిస్తున్నారు. కథకు తగ్గట్టుగా దర్శకుడు హీరోయిన్‌గా సాత్విక వీరవల్లిని తీసుకున్నారు. అమెరికాలోని వాండర్‌బిల్ట్ విశ్వవిద్యాలయం నుంచి మాస్టర్స్ చేసింది. 15 ఏళ్లుగా భరతనాట్యం నేర్చుకోవడంతో పాటు శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు సైతం ఇవ్వడం విశేషం.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.